శ్రీ

ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక.

రెండు నెలల కొకసారి ప్రకటింపఁబడును.

(Journal of the Telugu Academy·)

సంపుటము. ౨౩ { భావనామసంవత్సరము. మాఘఫాల్గునమాసములు. } సంచిక ౬.



కాకినాడ:
క్రొత్తపల్లి సూర్యరావుచే బరిషత్కార్యాలయమునఁ
బ్రకటింపఁబడినది.
చందా, పోష్టువ్యయములతో సంవత్సరమునకు రు. 3-౦-౦.
విడిసంచిక రు ౦-౮-౦.
1935.

విషయసూచిక.

ఆంధ్రసాహిత్య

పరిషత్పత్రిక.

కాకినాడ.

రెండు నెలల కొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము ౨౩.	భావనామసంవత్సరము. మాఘఫాల్గునమాసములు.	సంచిక ౬.

శ్రీరస్తు.

కర్ణాటక సాహిత్యపరిషత్తు.

శ్రీకృష్ణరాజేంద్రపరిషన్మందిరము — బెంగుళూరు.

అధ్యక్షులు.

మైసూరుసంస్థాన శ్రీమద్యువరాజ శ్రీకంఠీరవనరసింహరాజ ఒడయర్ బహద్దూర్ జి. సి. ఐ. ఇ. మహాస్వామిగారు.

(1) గమకకళాభ్యాసగోష్ఠి.

ఈగమకకళాభ్యాసగోష్ఠి పద్యకావ్యములను జదువు విద్య నేర్పుట కేర్పడినది.

కన్నడకావ్యములను జెవి కింపగున ట్లర్థము విశదపడునట్లు చదువు విద్యను బ్రచారము చేయవలయునను నుద్దేశముతో, కర్ణాటసాహిత్యపరిషత్తు వారొక గమకకళాభ్యాసగోష్ఠి (పరీక్షార్థమై) యేర్పాటు చేయుటకు నిశ్చయించిరి. ఈ ౧౯౩౫ సం॥రము ఏప్రిల్, మే, జూన్ నెలలలో బెంగుళూరులో బరిషన్మందిరములో నీగోష్ఠి జరుగును. ప్రసిద్ధగమకకళానిపుణులైన శ్రీమాన్ ఎస్. బిందూరావుగారు శిక్షకులు. ఈగోష్ఠి, ఆదివారములందును మఱియితరమైన సెలవుదినములలోను సామాన్యముగా- ఉదయము $7\frac{1}{2}$ గంటలు మొదలు $8\frac{1}{2}$ గంటలవఱకు నొకతరగతియు

సాయంకాలము 6½ గంటలు మొదలు 7½ గంటలు వఱకును వే ఱొక తరగతియునడుపఁబడును......ఈగోష్ఠిలోఁ జేరఁదలఁచినవారు కన్నడములో అప్పర్ సెకండరీ, అథవా, స్కూలుఫైనలుతరగతి విద్యార్థులును, దగినకన్నడసామర్థ్యము గలయితరులును గూడ నుండవచ్చును. చేరినవారు నెల కొక్కరూపాయి కట్టవలెను. విద్యార్థులకు షట్పదీకావ్యములు, చంపూకావ్యములు, పాటలు, సీసపద్యములు మొదలైనవి చదువుట నేర్పఁబడును. వారువారు నేర్చుకొను కావ్యభాగములలోని యర్థము, విశేషములు, కావ్యకవికాలాదులు బోధపడుటకై యపుడపుడు కొన్నియుపన్యాసము లీయఁబడుచుండును. చిట్టచివర పరీక్షలుచేసి యోగ్యతాపత్త్రిక లొసంగఁబడును. చాలినంతమంది చేరఁగానే గోష్ఠి ప్రారంభింపఁబడును. గమకకళయును, సాహిత్యస్వారస్యమును జనుల యనుభవములోనికిం దెచ్చుటకు భాషాభిమానమును బెంపొందించుటకును విద్యాభిమానులగు కర్ణాటకు లెల్లరు, నీగోష్ఠి శ్రేయస్కరముగా నభివృద్ధినొందునట్లు సాయపడుదురుగాక.

విద్యార్థులు తమతమ యపేక్షాపత్త్రములను యీ మార్చి 3౧ తేదీనాఁటికిఁ జేరునట్లు పంపవలయును.

వారిపేరు, వయస్సు, ఉద్యోగము, వారిభాషాసామర్థ్యము, సంగీతపరిచయమును దెల్పవలయును. వారువారు చదువుపుస్తకములు వారే సంపాదించుకొనవలయును. భోజనసదుపాయములును వారేచూచుకొనవలయును.

అని మొదలైనవిషయములతోఁ గర్ణాటకసాహిత్యపరిషత్తు గౌరవకార్యదర్శులు శ్రీయుత సి. కె. వేంకటరామయ్య, ఎం. ఏ. ఎల్. ఎల్. బి. గారు ప్రకటించియున్నారు.

(2) విశేషసాహిత్యోత్సవము.

1934 సం॥రం మే నెలలో నొకవారముదినములు జరిగినది. అది మీ కెల్లరకును విదితమే. అందు, కర్ణాటకోపన్యాసములు, గ్రంథప్రదర్శనము, విజ్ఞానశాలలు, కర్మాగారములు, వీనిసమీక్షణము మొదలగు ననేకవిషయములు సాహిత్యోపయోగములునడచినవి. ప్రసిద్ధవిద్వాంసులు, పరిశోధకులును, విజ్ఞానశాస్త్రములు, రాజ్యశాస్త్రములు, అర్థశాస్త్రములు, ఇతిహాసములు,కావ్యవిమర్శనములు మొదలైనవానింగూర్చి ముచ్చటించియుండిరి.ప్రత్యుపన్యాసమును ముగిసినపిమ్మట ప్రశ్నోత్తరములు నడచినవి. ఈయుత్సవములకుఁ గన్నడదేశమునుండి యనేకులు దయచేసియుండిరి. వీరిలోఁ బలువు రుపాధ్యాయులు; విద్యాప్రచారమునం దాసక్తి

గలవారును శతసంఖ్యాకు లుండిరి. ఈసాహిత్యోత్సవమును మహాజను లందఱు నుంజూచి సంతోషించిరి. పాఠశాలలలోని బోధనకార్యము, తగినట్లు నడచుటకును, కన్నడభాష బలపడుటకును, నిట్టిప్రకృతిలోకవిచారములం గూర్చిన యుపన్యాసములు ప్రయోజనకారు లని యనుభవమునఁ దోఁచుచున్నది.

అట్టివిశేషసాహిత్యోత్సవము నీసంవత్సరమునఁ గూడ నడపుటకుఁ బరిషత్తువారికిఁ గోరికి గలదు. అనేకప్రాంతములనుండి వచ్చు సూచనల నంగీకరించి యీసారియును రాఁబోవు మేనెల వేసవిసెలవులలో జరుపుటకు నిశ్చయింపఁబడినది. సాధ్యమైనంతవఱకు నిరుటికంటె నీయేఁడు విశేషముగా నొనరింపఁదలఁపుగలదు. గతవత్సరమున నీయుత్సవము జరపుటకు రు ౧౬౦౦ వ్యయమైనవి. మహాజనులు దొడ్డమనస్సుతోఁ దోడ్పాటుచేయనిదే యిట్టియుత్సవము జరుగుట కష్టము.

దేశవిద్యాభివృద్ధి కిట్టి ప్రయోజనకరమైన కార్యమును,అసాధ్యమని యెంచి విడిచిపెట్టుట పరిషత్తున కిష్టముగాదు. పరిషత్తు మీవంటి యుదారపురుషులను నమ్మి నిల్చి యున్నయది. కాలస్థితి సంకుచితముగానున్నను దేశభాషాభిమానము ముఖ్యమని తలంచి మాప్రార్థనలను తమరు లాలించెద రని నిరీక్షించుచున్నాము. ద్రవ్యసహాయ మెంతవిశేషముగఁ గలిగిన నంతవిశేషముగ నుత్సవము జరగును. కాఁబట్టి కుతూహలముతో మేము మీయనుగ్రహమునకై యెదురుచూచుచున్నాము. అని ఎం. ఆర్. శ్రీనివాసమూర్తి బి. ఏ. గారు (హెడ్ మేష్టరు నార్మల్ స్కూలు) డి. వి. గుండప్పగారు (మైసూరు లెజిస్లేటివ్ కౌన్సిలులోను యూనివర్సిటీ కౌన్సిలుసినేటులోను మెంబరు) సి. కె. వేంకటరామయ్యగారు ఎం. ఏ. ఎల్. ఎల్. బి. (సర్కారుట్రాన్స్లేటరు) వ్రాయుచున్నారు.

శ్రీభగవద్గీతాదర్శనము-పర్యాలోచనము.

బ్ర. శ్రీ. నిడమర్తి జలదుర్గాప్రసాదరాయుఁడుగారు సాంద్రతాత్పర్యమును శ్రీభగవద్గీతాదర్శన మను పేర గీతలకు వ్యాఖ్యానము నొకటిని వ్రాసి ప్రకటించిరి. భారతాంతర్గతమును నేడువందలు శ్లోకముల పరిమితిని గలదియు, భగవంతుఁడగు కృష్ణపరమాత్మచే నర్జునునకు నుపదేశింపఁబడినదియు, సర్వజ్ఞుఁడగు వేదవ్యాసునిచే యథోపదిష్టముగా నుపనిబద్ధమును, మతకర్తలగు నాచార్యపురుషులకు మువ్వురకును బరమప్రమాణమును, సర్వోపనిషత్సారభూతమును నగుగీతాశాస్త్రము నర్థము సులభగ్రాహ్య మగునటుల నెంద ఱెన్ని వ్యాఖ్యల వ్రాసినను జాలును వలదనువాఁ డుండఁడు. ఈశాస్త్రము నర్థము సర్వజనగ్రహణీయ మనుటకు సాక్ష్యము ప్రపంచమునఁ బ్రచురములుగా నున్న యెల్లభాషలలోనికి నిది పరివర్తితమగుటయు.

ఈ గ్రంథకర్త గీతాశాస్త్రమున నొకింత కృషిని జేసినవాఁ డనుట యతిశయోక్తి కానేరదు; స్వయంకృషివలన శాస్త్రార్థమును సాధింపఁ గడఁగువానియందుఁ గల లోపము లీవ్యాఖ్యాతయందు నొక కొన్ని గన్పించుచున్నవి. రెండవయధ్యాయమున నలువదియొకటవ శ్లోకమునకు వ్యాఖ్యను వ్రాయుచు 'మత్పర' యను మాటకు శంకరాచార్యుని వివరణము నిచ్చియు నట వాసుదేవశబ్దము నర్థమును గ్రహించియుండలేదు. ఇట్టివి మఱియుఁ గలవు. ఈ నేరమి గురుశుశ్రూషచేఁ గాక స్వయంకృషివలన శాస్త్రార్థమును గ్రహింపఁదలఁచు వారియెడల సాధారణముగాఁ గన్పించును. శాస్త్రమర్యాదను గుర్తెఱింగినవాఁడు కావ్యాదులయందువలె శాస్త్రములయం దశ్లీలాదిదోషములను బరిగణింపఁడు. 'కప్యాస'మ్మనుచో శ్రీరామానుజుని గూర్చి పరంపరాప్రాప్తమైన కథయే కావ్యదృష్టికిని శాస్త్రదృష్టికిని గల భేదమును వెల్లడించుచున్నది. ఎనిమిదవ యధ్యాయమున నేడవ శ్లోకమున వీరికిఁ దోఁచిన యభిప్రాయము నట్టిద. రెండవ యధ్యాయమున నేడవ శ్లోకమునకు నర్థమును జెప్పుచుఁ గార్పణ్యశబ్దమును వ్యక్తీకరించిన పద్ధతియుఁ, దమ లెక్కప్రకారమున నాయధ్యాయమునఁ "దొమ్మిది ఏ"గుర్తుఁ గల శ్లోకమును వివరించిన పద్ధతియును జాటును. కృపా కార్పణ్య శబ్దములకు సంబంధము గలదని వీరు పొరఁబడిరి. కృపణ శబ్దమునకు నుపనిషత్సిద్ధమగు నర్థమును గానరైరి.

ఈవ్యాఖ్యాత పాశ్చాత్యులయుఁ దద్విజ్ఞాన వ్యామోహితులయుఁ బ్రక్షిప్తవాదమును గేవల మంగీకరింపకపోయినను దత్పక్షమున కొకకొంత సహాయుఁడువలె నచ్చటచ్చటఁ దన యభిప్రాయమును వెల్లడించు స్వభావమును గలవాఁడు. ఈదృశప్రక్షిప్తవాదము నూహించుటకుఁ బూర్వులగు కొందఱు వ్యాఖ్యాతలు ద్వితీయాధ్యాయమున శాస్త్రార్థము సమస్తమును సూత్రింపఁ బడిన దని వ్రాయుటయు నాధారము. సూత్రరూపమున నీయధ్యాయమునఁ దెలుపఁబడిన శాస్త్రార్థమునకు వివరణగ్రంథమే తక్కిన పదునాఱధ్యాయములును. ఈయభిప్రాయమునుగూడఁ బురస్కరించికొని నేఁటివఱకుఁ బాశ్చాత్యులు గీతలయందు యథాశక్తిఁ బ్రక్షిప్తముల నూహించుచునే యున్నారు. వారి సాహసమును సంపూర్ణముగా నీవ్యాఖ్యాత వహింపకపోయినను గొంతవఱకా మార్గమునఁ గృషిసల్పిరి. గీతాశాస్త్రమే ప్రక్షిప్తమను వారు వ్రాయువ్రాఁతలకంటె నిది యన్యాయము కాదు. ఐనను సంప్రదాయసిద్ధముగా నీశాస్త్రము నలవరించికొనినవారు మిక్కుటముగా నీవాదమును జేయరని మాయూహము. తిలకు దీనికుదాహరణము.

శ్రీశంకరభగవత్పాదాచార్యులు, "గీతాఖ్యైస్సప్తభిశ్శ్లోకశతైరుపనిబబంధ"యని వ్రాసినారు. వారివ్యాఖ్యావిలసితమగు గ్రంథమునఁ గ్రమముగాఁ బదునెన్మిది యధ్యాయములందును నేఁడువందల శ్లోకములున్నవి. నాఁటినుండియు సర్వవేదాంతులకు సమ్మతములు సార్థకములగు వానిలో నొకకొన్ని వీరికిఁ బ్రక్షిప్తములని తోఁచినవి. వీరికిఁ బ్రక్షిప్తము లని తోఁచిన వానిలోఁ బదమూఁడవ యధ్యాయారంభమున వీరుదాహరించిన 'ప్రకృతిం పురుషంచేవే' త్యాదిశ్లోకము నెచ్చటనుండి గ్రహింపఁబడినదో తెలియదు. శ్రీశంకరాదులు గీతాశాస్త్రమునం దెచ్చట నీశ్లోకమును జేర్కొనలేదు; కావున దానిని వీరు ప్రక్షిప్త మనుటకేమి యాటంకమును లేదు. శాస్త్రమునందు లేనిదానినిజూపి ప్రక్షిప్తమనుటకు విశేషమును గానరాదు. ఇఁకఁ బ్రథమాధ్యాయమున ముప్పదియెన్మిదవశ్లోకమును వీరు మిత్రద్రోహశబ్దాన్వయ మాపట్టునఁ గుదురమిఁ బ్రక్షిప్తమనిరి. ద్రోహశబ్దమును లౌకికదృష్టిచే విచారించిరే కాని జిఘాంసార్థముగల ద్రుహధాతు నిష్పన్నమునుగా గ్రహింపరైరి. అటుల గ్రహించినచో సంప్రదాయవిరుద్ధముగా నాశ్లోకమును బ్రక్షిప్తమని వీరనరు. తక్కినవి మూఁడు వీరుప్రక్షిప్తము లనిన శ్లోకములు-వాని యర్థరహస్యమును వారే మననాదికమువలన గ్రహింపఁగలరు- వానిలోఁ బదునేడవయధ్యాయాదిమశ్లోకమునకు శ్రీశంకరాచార్యులవా రన్యాయార్థకల్ప

నావకాశమునుగూడ తమభాష్యమున నాశంకించుటచే వారికిఁ బూర్వము నీశ్లోకము నర్థము వివదింపఁబడుచుండెనిదేమో యనుటకు సాధ్యమగుచున్నది.

శాస్త్రము నర్థమంతయు రెండవయధ్యాయమున సూత్రరూపమునఁ జెప్పఁబడినటుల సర్వవేదార్థము నీయధ్యాయమున నుపబృంహితమైనది.

ఈ వ్యాఖ్యాతలు శ్లోక క్రమమును మార్చి నూతనత్వమును గీతల కొడఁ గూర్చినారు. మూఁడవ యధ్యాయమునఁ గల శ్లోకము లొకకొన్ని యచ్చట నప్రస్తుతము లనియు నింకొకచో వానిని జేర్చవలయుననియు వీరూహించిన దానిని విమర్శించిన నట్లే వీరు చేసిన మార్పులన్నియు శాస్త్రసంప్రదాయములకు భిన్నములని యెల్లవారికిని దోఁచును. కర్మాకర్మలలోఁ గర్మ మంచిదనియు నాకర్మయందును విష్ణుస్వరూపమగు యజ్ఞముకొఱకైన కర్మ బంధహేతువు కాదనియుఁ దదితర మెల్ల కర్మయు బంధహేతువే యనియు యజ్ఞస్వరూప మిట్టి దనియుఁ జెప్పినవిషయము పరమేశ్వరార్పణబుద్ధితోఁ జేయు యజ్ఞకర్మ కర్తవ్యమని బోధించు తృతీయాధ్యాయమున నసంగతము నప్రస్తుతముగా వీరికిఁ దోఁచినది.

బ్ర. శ్రీ నిడమర్తి జలదుర్గాప్రసాదరాయుఁడుగారు తమగ్రంథమున విజ్ఞాపనాంతమున జిజ్ఞాసను గూడ వ్రాయుటచేత నిందనుక యీగ్రంథము గుణాగుణములఁ జర్చింపవలసివచ్చినది; మఱియు శ్రీసాహిత్యపరిషత్తువారు నన్నీగ్రంథమునకుఁ బర్యాలోచనము వ్రాయుమనుటచేతను, సర్వోపనిషత్సారభూతమును బరమప్రమాణము నగు గ్రంథమిదియగుటచేతను నప్రియ మైనను సత్యమును నాకుఁ దోఁచినదానిని వ్రాసితిని; క్షన్తవ్యుఁడను.

కోపల్లె శివకామేశ్వరరావు.

పీఠికాపుర కలాశాల, సంస్కృతాంధ్రాధ్యాపకుఁడు.

గ్రంథస్వీకారము.

1. పూలమాల.

శ్రీమతి స్థానాపతి రుక్మిణమ్మగారు రచియించినది. ఈయమ పదునెనిమిదేండ్ల వయసుగలదియఁట. పాఠశాలలోఁ జదువలేదు, గురుకులవాసము చేయలేదు. స్వయంకృషిని, భర్తగారిసహవాసమున నిట్టికవితను గూర్చినదనుట మెచ్చఁదగినది. ౧౮ పుష్పములతో గ్రుచ్చఁబడిన యీమాలలో మొదటిపుష్పము 'కాత్యాయని'-"ఓంకారపంజరశుకీం" అను శ్లోకమునకుఁ దెనుఁగుపద్యము.

శ్రీమదోంకారపంజరాసీనశుకము, ప్రాంచదుపనిషదుద్యానపరభృతమ్ము
ఆగమారణ్యవీథీమహామయూర, మైనకాత్యాయనీదేవి నాత్మఁదలఁతు.

మూలములో శుకీం, కలకంఠీం, మయూరీం అని కలవు. వానినట్లే స్త్రీలింగరూపములుగానే యుంచిన నెక్కుడుసొగసుగా నుండియుండును. "చాటింపు" ప్రహరిశ్లోకములకుఁ దెనుఁగు.

"లేరుతల్లిదండ్రులు లేరులేరు బంధు, వర్గము సహోదరులు లేరు, వసతిలేదు
తలఁపనియ్యెడ సుంతైన ధనములేదు, కాన జాగర్తి జాగర్తి కాచుకొనుఁడు."

ఇందు జాగర్తి యనుటకంటె జాగ్రత్త యనుట లెస్స. "గుమ్మఁడు" గుమ్మఁ డేడే కన్నతల్లీయను గేయము ననుసరించినది. "కృష్ణునితో పాంచాలి"-సోమయాజిగారి భారతభాగము ననుసరించి రచియింపఁబడినది.

"వరమునఁ బుట్టితిన్ భరతవంశముఁజొచ్చితి" నను పద్యమున కీయమ్మగారి పద్యము చిత్తగింపుఁడు.

ఉ. పుట్టితి నగ్నికుండమునఁ బుత్రికనై ద్రుపదాధినేతకున్
మెట్టితిఁ గుంతికోడలుగ మేలగు నీభరతాన్వయమ్ముఁ జే
పట్టితి ధర్మమూర్తులగు భర్తలఁ గొంటిని నీతిధైర్య స
మ్రాట్టులఁ బుత్రుల న్నటియు మాసహజన్ముల ప్రాపుగాంచితిన్.

ఎచ్చటను స్థాయిగానక నానామార్గములుద్రొక్కుచున్న నేటికవులరచనల యందుకన్న, పూర్వకవులరచనలయందే రుక్మిణమ్మగారికి పక్షపాతము మిక్కుట మని పీఠికలో శ్రీయుత అబ్బూరి రామకృష్ణరావుగారు వ్రాసినది నిక్కము. సత్కృషి చేసి రుక్మిణమ్మగా రింతకంటె మంచి పొత్తములను రచింప నాశీర్వదించుచున్నాము. వెల, ఆఱణాలు. విశాఖపట్టణములో మెయిన్ రోడ్డులో రుక్మిణమ్మగారియొద్దనే దొరకును.

2. శ్రీపూసపాటివంశానుచరితము ప్రథమభాగము. కళింగఘాద్పాగ్రంథమాల. విజయనగరములో బ్రః శ్రీ దువ్వూరి జగన్నాథశర్మగారిచేఁ బ్రకటింపఁబడినది. దీనికి ఫోరువర్డు విశాఖపట్టణము జిల్లాజడ్జీ వెర్నర్ ఏ. బ్రాడీదొరవారురచియించిరి.

విజయనగరము సంస్థానాధీసులైన పూసపాటివారిచరిత్ర మింకను బహుచరిత్రములనుండి సంగ్రహించి యుక్తియుక్తముగ సప్రమాణముగ రచియింపఁబడినది. పూసపాటివారను నామమువచ్చుటకుఁ గలయైతిహ్యము లన్నియు దీసి చర్చింపఁబడియెను. పూసపాడను గ్రామమునంగల కోటను రక్షించుటచే, పూసపాటివారను పేరువచ్చినట్లును-పుంసపాటుఁడను మహానందిసుతునిబట్టి వచ్చినట్లును-శిలాదిత్యునిభార్య పూషావతి యనుగర్భవతి శత్రువుల బారినుండి యొక్క బ్రాహ్మణునిచే రక్షింపఁబడినట్లును ఆపూషావతి(శత్రుభయమున) గుహాలోపలవాసముచేయుటచే గుహాసంభవత్వపరముగా గెహిలోటు లైరనినట్లును, గెహిలోటులు (గ్రహాలాట్టులు) గ్రహారాట్టులనుటకు వాడుకలోఁ జెడినమాటయనియు గెహిలోట్టులే పూసపాటివారయినట్లును-ఐతిహ్యములనుబట్టి- బహుపుస్తకభాండాగారములలో గ్రంథ సహాయమునుబట్టి పెట్టింగు, ఈస్టువిక్కు, లోకనాథఘోషు, బాల్ఫోరు, టాల్భాయి, ఫీలర్, జేమ్సు, రన్నెలు మొదలగు చరిత్రకారుల గ్రంథములం బట్టి యునాలోచించి శర్మగారు చక్కఁగా రచియించియున్నారు. ఇందు క్షత్రియులలోని శాఖలు గోత్రములుం దెల్పి యీపూసపాటి వా రేశాఖవారో తెల్పిరి. శ్రీసూర్యాన్వయ సముద్దీపకులును శ్రీమాధవవర్మాన్వయాలంకారులునగు నీమహారాజవంశస్థుల గృహనామము శ్రీపూసపాటివారనునది భావ్యముకా దనకుండ పౌరుషేయమేయనుట నీగ్రంథము విశదీకరించు నని తెల్పిరి. ద్వితీయభాగములో సత్యనిర్ధారణము గావింపఁబడునఁట.

ఈగ్రంథము పోషకులకుఁ బండితులకుమాత్రము "ప్రైవేటు సర్క్యులేషన్" నిమిత్తమనియు నీప్రతికి వెల పోషకులదయ యనియుఁ వ్రాసినారు.

3. పాదుషాహైదరాలీ.

ఆంధ్రప్రచారిణీగ్రంథమాల ౨౨ వ పుస్తకము. ప్రకాశకులు కవిరాజహంస వోలేటి పార్వతీశముగారు. గ్రంథకర్త శ్రీఅలంపూరు కృష్ణస్వామిగారు—ఇరువదియైదు ప్రకరణములు 184 పుటలు. వెల 1—8—0. ప్రకాశకు లగు శ్రీవోలేటి పార్వతీశముగారికి పిఠాపురము వ్రాయవలయును.

(కాళీభట్ల 'బ్రహ్మయ్యశాస్త్రిగారు—గతసంచిక శేషము.)

—: నీ తు లు :—

ఇదివఱకొ రసమునుగూర్చి ముచ్చటించుకొని యున్నాము. కావున నింక నీతులంగూర్చి ప్రసంగించుకొందము.

"ఈయుపాఖ్యానమునందు ముఖ్యముగ శృంగారరసము ప్రకటితము. నీతియుఁ దత్సంబంధికమే" అని రావుగారు వ్రాసిరి. ఇందలిశృంగారరసము నీచస్థితియం దున్న దని మన మిదివఱకుఁ దెలిసికొనియున్నాము. నీతియుఁ దత్సంబంధికమే యని రావుగారు చెప్పినది సరిగ సరిపడియున్నది. ఇందలిరసమువలెనే నీతియు నీచస్థితియందే యున్నమాట నిజము. ఈ ప్రబంధమునందలి నీత్యాధిక్యముం గూర్చి వ్రాయుటకుఁ బూర్వము పెద్దనకాలమునందలి పరిస్థితులంగూర్చి ముచ్చటించుకొనవలసియున్నది. "ఆకాలముపరిస్థితులు, నానాఁటికవితాసంప్రదాయములు, నప్పటిప్రజలయొక్కయు, రాజులయొక్కయు, మనోవృత్తులు మున్నగునవి సాకల్యముగ గుర్తించినఁ గాని పెద్దనార్యునికవితాకన్యయొక్క యాకృతిక్రియాలక్షణములయందలి యుత్కృష్టతానికృష్టతలను, నింద్యానింద్యస్థితిగతులను నిర్ణయింప నవకాశ ముండదు." అని రావుగారు సరసముగా వ్రాసిరి. కాని "ఈయుపన్యాస మంతయు శ్రీశాస్త్రిగారికి నవసరము లే దని నాకుఁ దెలియును." అని కూడ వ్రాయించిరి. ఇట్లేల వ్రాసిరో నాకుఁ దెలియవచ్చుట లేదు. న్యాయముచేఁ గృష్ణదేవరాయాదులకాలపరిస్థితులు నాకే యవసరము. అవి నావాదమునకే యనుకూలించును. ఇదివఱకు వానిఁ బరామర్శించియేయున్నాను. అయినను రావుగారు నావ్రాసినదానిఁ జూచుకొనక యప్పటికాలస్థితుల పరిశీలన మవసర మని కూడ నొక్కివక్కాణించుచున్నారు కావునను, చరిత్రాంశములను బరిశీలించుట ముఖ్య మనుచున్నారు కావునను, నప్పటిచరిత్రాంశముల బాగుగఁ బరిశీలించి వానిని బట్టియే నీతివిషయములో మనుచరిత్ర మెట్లున్నదో నిరూపించి చూపెదను. ఈ ప్రబంధోద్దేశ మంతయుఁ దెలిసికొనుటకై శ్రీకృష్ణదేవరాయల గమనికలం గూర్చి భాషించుకొనవలసియున్నమాట నిజము.

రాయలు కళానిధి, కువలయహితకరుఁడు, విబుధపోషకుఁడు, జడజాతవిరోధి, చక్రపాలకుఁడు, సత్పతియు నగురాజే కాని పరికించి చూడ నీతనియందొకకళంకము కలదు. ఈమహాప్రభునకుఁ జిన్నతనమునందే చిన్నమ్మ యను వేశ్యతోడి పొత్తు సంప్రాప్త మయినది. ఈమెనే చిన్నాదేవి యందురు. ఈమె రాయ

లుంచుకొనిన గణికయని చరిత్రములు ఘోషించుచున్నవి. రాయలవారిభార్యలలో నొకయుంపుడుకత్తె కలదనియు నామెపేరు చిన్నాదేవి యనియు న్యూనిచ్ అను పోర్చుగీసురాయబారి లిఖించియున్నాఁడు. మఱియు కీ. శే. కొమర్రాజు వేంకట లక్ష్మణరావుపంతులవారు తమహిందూదేశకథాసంగ్రహములో నీమె పణ్యస్త్రీ యనియే వ్రాసిరి. శ్రీయుత ఆదిపూఁడి సోమనాథరావుగారుకూడఁ దమకృష్ణదేవ రాయచరిత్రములో "సీ. వెలయాండ్రలోఁబుట్టి విమలగుణాళిచే నొప్పి యెప్పుడు తనమెప్పు వడయఁ గోరుచిన్నాదేవిఁ గూరిమిఁ బెండ్లాడె" యని వ్రాసిరి. వారిమాట యువీరిమాటయు నెంగులకు మన శ్రీ ఓరుమల్ల అచ్యుతరావు యమ్.యే.,యల్.టి. గారే కృష్ణదేవరాయలభార్యలం గూర్చి యిట్లువ్రాసిరి. "1. చిన్నాదేవి-భోగస్త్రీ 2. తిరుమలదేవి- ఉమ్మత్తూరి గంగరాజుకూఁతురు. 3. అన్నపూర్ణాదేవి- ప్రతాపరుద్ర గజపతికూఁతురు." పెక్కేల? చిన్నాదేవి వేశ్య యనుసంగతియును నామె బాల్య ముననే రాయలతో సంబంధించిన సంగతియును మనరావుగారును నంగీకరించిరి. రాయలు ధనాఢ్యుఁడు గావున వేశ్యాప్రియుఁ డైనఁ గావచ్చును, గాని యాతఁడు వేశ్య నుంచుకొనుటతోఁ దృప్తినొందక యామెయం దగ్గలమైన వలపు గలవాఁ డై యామెను దనభార్యలతో సమానగౌరవప్రపత్తులు కలదానినిగాఁ జేసి తన దేవేరులలో నొక్కదానినిగా నొనరించి తా నెచ్చటికిఁ బోయిన నచ్చటికిఁ దీసికొని పోవుచు బహిరంగముగా నేలఁజొచ్చె. ఈరాయలవారు తిరుమలదేవాలయము లోఁ దనయొక్కయుఁ, జిన్నాదేవియొక్కయుఁ, దిరుమలదేవియొక్కయు లోహ ప్రతిమలు చెక్కించిస్థాపించె. ఆ ప్రతిమలు మూఁడును నిలువంబడియున్నవి. కుడివైపుననున్నది చిన్నాదేవి ప్రతిమ. నడుమ నున్నది రాయలవిగ్రహము. ఎడమవైపున నున్నది తిరుమలదేవిబొమ్మ. ఈ విగ్రహముల కుడిభుజములపై చిన్నాదేవ్యరు, కృష్ణరాయ మహారాయరు, తిరుమలదేవియరు అని పేరులుఁ గన్నడములోఁ జెక్కఁబడియున్నవి. ఈ ప్రతిమల ప్రతిబింబపటములు తీయించి యాంధ్రసారస్వతపోషకు లగు బ్రహ్మశ్రీ జయంతి రామయ్యపంతులవారు లోకోపకారార్థమై యాంధ్రసాహిత్యపరిషత్పత్త్రికలోఁ బ్రచురించియున్నారు. వానిని జదువరుల యుపయోగార్థమై యీ ప్రక్క నిచ్చితిని.

భోగస్త్రీ యగు చిన్నాదేవిని నొకప్రక్కను దనకులస్త్రీ యగుతిరుమల దేవిని నొకవైపునను నుంచుకొని ప్రతిమలఁ దీయించి సుప్రసిద్ధమహాస్థల మగు తిరుమలలో రాయలవారు స్థాపించుటంబట్టియే వారు వేశ్యతోడి పొత్తును గౌర

వనీయ మైనదానినిగా భావించుకొని రని తేలుచున్నది. మఱియు నామెను దేవి యనిపిలుచుట కూడ నీయంశమును మఱింత స్థాపించుచున్నది. ఈ ప్రతిమలఁ దీయించుకొనుకాలమునాఁటికి నన్నపూర్ణాదేవిని జేపట్టలేదు. ఈవివాహము చాల యాలస్యముగ నైనదికావున శాసనాదికములలోఁ గూడఁ జిన్నాదేవియొక్కయుఁ దిరుమలదేవియొక్కయుఁ బేరులే చాలవఱకుఁ గాన్పించుచున్నవి. రాయలువారీరీతిగాఁ దాము చిన్నాదేవిని గౌరవించుటయే కాక తనయాశ్రితులు కూడ గౌరవించునట్లు చేసిరి కావుననే యాతనియాస్థానకవు లగుపెద్దనార్యాదులు కూడఁ దాము విరచించిన కావ్యములలోఁ జిన్నాదేవిని గూడఁ దనభార్యనుగా వర్ణించుట కవకాశము కలిగించెను. పెద్దనార్యుని మనుచరిత్రములో రాయలదేవేరులం గూర్చి యిట్లు వ్రాయఁబడియున్నది. "క. అవిభువనంతరంబ ధ,రావలయముదాల్చెఁ గృష్ణరాయఁడు చిన్నా,దేవియు శుభమతి తిరుమలదేవి యు నం దనకుఁ గూర్చు దేవేరులుగన్" ఇట్లే పారిజాతాపహరణమందును వర్ణింపఁబడియున్నది. వీని నన్నిటినిబట్టి చూడ వేశ్యను బహిరంగముగాఁ దనయింటఁ బెట్టుకొని నిశ్శంకముగా రాయ లేలఁజొచ్చె నని తేలుచున్నది.

రాయ లీప్రకారముగా వేశ్యను భార్యనుగా నింటఁబెట్టుకొని యేలుచుండుటయే గాక వేశ్యాసంపర్కము సరసతను సౌఖ్యమును హెచ్చించు నని తమ సన్నిధానవర్తులలో నూహాలు బయలువెడలి వారుకూడఁ వేశ్యాలోలు రగుటకుఁ దగుప్రోత్సాహము నిచ్చినట్లు కూడఁ గాన్పించుచున్నది. ఈతనిసభలో ధూర్జటికవింగూర్చి యీక్రిందిప్రసంగము జరిగె. సభవారిలో నొక్కరు "స్తుతమతి యైన యాంధ్రకవి ధూర్జటిపల్కుల కేల కల్గె నీయతులితమాధురీమహిమ" అని సమస్య నిచ్చిరి. అందుపై మఱియొక్కరు "చ. స్తుతమతి యైన యాంధ్రకవి ధూర్జటిపల్కుల కేల కల్గె నీ, యతులితమాధురీమహిమ హా తెలిసెన్ భువనైకమోహనో, ద్ధత సుకుమారవారవనితా జనతాఘన తాపహారి సం,తతమధురాధరాధర సుధారస ధారలు గ్రోలఁగాఁ జుమీ" అని పూర్తిచేసిరి. దీనింబట్టి రాయలసభలో వేశ్యాప్రియులకు గౌరవ ముండెడి దనియు నద్దాని నొకఘనకార్యముగా నచ్చటివారు చెప్పుకొనుచుండెడివారనియుఁ దేలుచున్నది. రాయలసభలో నిట్టిచర్చ జరుగుట తనతాతకు యశస్కర మని భావించి కుమారధూర్జటి తనకావ్యములోఁ దనతాతం గూర్చి యిట్లు చెప్పుకొనియెను. "చ. స్తుతమతి యైన యాంధ్రకవి ధూర్జటిపల్కుల కేలకల్గె నో, యతులితమాధురీమహిమ నా మును నీపెదతాత చాలస, న్నుతిఁ

గనెఁ గృష్ణరాయల మనోజ్ఞసభ న్వెను విూవు నట్లు మ,త్కృతబహుమానవైఖరు లఁగీర్తివహింపుము ధాత్రిఁ గోపలన్." పెక్కేల్ల రాయలు వేశ్యలకు బహువిధములగు ప్రోత్సాహముల నిచ్చె. తనయాముక్తమాల్యదలో వీరిని విశేషముగా వర్ణించెను. ఈతనివిద్యానగరమునఁ బండ్రెండువేలు వేశ్య లుండెడివా రని చరిత్రములు ఘోషించుచున్నవి. చారిత్రములలో విజయనగరమందలి వేశ్యవాటికలంగూర్చి ప్రత్యేకవర్ణనము గలదు.

రాయలవారివేశ్యాప్రియత్వమే యాకాలమున వేశ్యల కింత విశేషస్థితిని దెచ్చిపెట్టె. అంతమాత్రముచే వేశ్యాప్రియత్వమును మనసంఘ మంగీకరించిన దని చెప్పఁగొనఁదగినది కాదు. మనసంఘ మెప్పుడును వేశ్యానృత్యగానములకు బ్రోత్సాహ మిచ్చుచున్నను వారలసంపర్కము నెంతమాత్ర మంగీకరింపలేదు.

మన స్మృతులు—"శ్లో. పశు వేశ్యాదిగమనే మహిష్యుష్ట్రీం కపీం తథా ఖరీం చ సూకరీం గత్వా ప్రాజాపత్యం సమాచరేత్॥" (పరాశర) అని ప్రాయశ్చిత్తములు విధించుచున్నవి. మఱియు ను "శ్లో. దర్శనా చ్చిత్తవైకల్యం స్పర్శనాత్తు ధనక్షయం సంభోగాత్ కిల్బిషం పణ్యస్త్రీణాం ప్రత్యక్షరాక్షసామ్" అని వేశ్యాసంభోగము పాపదాయక మని నొక్కి చెప్పుచున్నవి. ఇంకను మనకవులు "పణ్యస్త్రీషు వివేకకల్పలతికాశస్త్రీషు రజ్యేత కః" అని యును "వేశ్యా శ్మశాన సుమనా ఇవ వర్జనీయాః" అనియు ను "వెలయాలి జీవనము జీవనమే తలపోసి చూడఁగా"అనియు "క శ్చుంబతి కులపురుషో వేశ్యాధరపల్లవం మనోజ్ఞ మపి" అనియు బహువిధముల వేశ్యాసంభోగము నిందించి వైచి యున్నారు. సంఘమును దానినంగీకరించువారిని నిషేధించి వైచుచున్నయది. ఈవిషయమై నవనాగరకాగ్రగణ్యు లగుకందుకూరి వీరేశలింగముపంతులవారు"అదిగాక మనధర్మశాస్త్రకర్తలు వేశ్యాప్రియులను పంక్తిబాహ్యు లనియు వారికి రాజసభలలో కొలువు నియ్యకూడ దనియు విధించి యున్నారు. అందుచేతఁ బూర్వకాలమునందు వేశ్యల నుంచుకొన్న వా రెంతో హీనులుగాఁ జూడఁబడుచుండిరి. మనరాజులు వారికి సభలలోఁ బను లీయకుండిరి. కులమువారలు వారిని మిక్కిలి తక్కువగాఁ జూచుచుండిరి. కాఁబట్టి యాకాలములో బహిరంగముగా వేశ్యల నుంచుకొనుట ఎంతో తలవంపులుగా నుండి మానాభిమానములు కలవా రందరును వ్యభిచారమును మానుచు వచ్చిరి." అని వ్రాసిరి. ఈవిధముగా శాస్త్రమును సంఘమును గట్టిగా నిషేధించుచున్నను కృష్ణదేవరాయలు నిరంకుశత్వమువహించి వేశ్యను బహిరంగ

ముగా నంతఃపురమునఁ బెట్టుకొని వేశ్యాప్రియులను దనసభలో గౌరవించుచు వేశ్యల నాదరించుచు వచ్చెను. అయిన ను రాజు చేయు పని చాల దుష్కృత్య ముగా నున్న దనువాడుక లోకములోఁ బుట్టకపోలేదు. కాని ధనబలసమేతు లగు వారలు నిజదోషముల నొప్పుకొనక పోవుటయే కాక పైఁగాఁ దాముచేయునది యోగ్య మైనపనియే యని లోకమునకుఁ దోఁచునట్లు చేయఁ బ్రయత్నింతురు, కాన, రాయలవారు ను దాము స్వీకరించిన వేశ్యాప్రియత్వమునందుఁ దప్పులే దనియు నది మంచిపనియే యనియు లోకమునకు బోధలోనికి వచ్చునట్లు చేయ సరసములగు మార్గముల నవలంబించెను. మనుచరిత్రము పుట్టుటకుఁ గల కారణ ములలో నిది మొదటిది.

పెద్దన కావ్యకథ నేర్పా టెవరు చేసిరి.

పెద్దనార్యుని ప్రబంధచరిత్రము నంతను బరికించి చూచిన రాయలకళంక మును బాపుటయే ప్రధానోద్దేశముగాఁ బెట్టుకొని యీకబ్బము వ్రాయఁబడినదని ప్రాజ్ఞులకుఁ దెలియకపోదు. ఈప్రబంధేతివృత్తమును నిర్ణయించుటలోఁ దత్కర్త యగుపెద్దనార్యున కేవిధమగు స్వాతంత్ర్యమును లేనే లేదనియు రాయలవారే దాని నేర్పాటుచేసి రనియు మనరావుగా రిట్లు వ్రాసిరి. "మనుచరిత్రకథ నెంచికొ నుటలోఁ బెద్దనార్యుని కెంతమాత్రము నధికారము లే దని యు నాపనిని శ్రీకృష్ణ దేవరాయలవారే చేసి పెద్దన్ననుఁ బ్రబంధము రచియింపుఁ డని యాజ్ఞాపించి రని యు మనుచరిత్రము జాగ్రత్తగాఁ జదివినవారికి స్పష్టమగును."

ఈకథ నేల నిర్ణయించె?

పెద్దనార్యుఁడు తన ప్రబంధకథను నిర్ణయించుటలో నధికార మెంతయు లేద నియు నంతలో రాయలబానిసేఁ డాయె ననియుఁ జెప్పఁజాలను, గాని, మొత్తము మీఁద వా రుభయులును గలిసి యీకథ యుండఁ దగు నని నిర్ణయించినట్లుతోఁ చెడిని.

ఈప్రబంధేతివృత్తమేది ?

పెద్దనార్యుని ప్రబంధమునందలి ముఖ్యకథ ప్రబంధమునందుఁ దెలుపఁ బడినరీతిగా స్వారోచిషమనుచరిత్రము కాదు. ఇందులో ముఖ్యమైనది వరూథినీ నామకవేశ్యాచరిత్రము కావుననే విమర్శకులు కొందఱీయది వరూథినీచరిత్రము కాని మనుచరిత్రము కాదని యిదివఱకే వ్రాసియున్నారు. ఈప్రబంధములో మను పురుషోక్త చరిత్ర మత్యల్పము కదా ! ఇది నిర్వివాదాంశము, కావుననే యీ

ప్రబంధమునకు మనుచరిత్ర మని కాని మనుసంభవ మని కాని పే రుండఁదగినది కా దని పండితప్రకాండు లభిప్రాయపడుచున్నారు. మన శ్రీమదచ్యుతరావు గారే "ఈకథయందలి సార మంతయు వరూథినీప్రవరుల యుపాఖ్యానమునందే యున్న దని యుఁ దక్కినభాగ మంతయు, రసోత్సేకము కలుగఁజేయలేని వల్లీబంధ మనియుఁ బెద్దనార్యుఁడు తనలోకోత్తరకావ్యప్రజ్ఞ నంతయు నీయుపాఖ్యానమునందే చూపించె ననియు వారినమ్మకము" అని లిఖించిరి. ఇదియే ప్రధానమనిరి. ఈవిధముగా మనువుయొక్క చరిత్రము మూలకుఁ ద్రోసివేయఁబడుటకుఁ గల కారణ మేమి? పెద్దనార్యుఁడు వరూథినీచరిత్రమునే ప్రధానము చేసికొనెను, గావున, దానిని విరచించుటలోనే తనప్రజ్ఞావిశేషము నంతను హెచ్చుగాఁ జూపెను. మనువుయొక్క చరిత్రము నప్రధానముగాఁ జూచుకొనెను, గావుననే దాని నెట్లెట్లో యీడ్చివైచె.

పెద్దన తనకృతికి మనుచరిత్ర మనుపే రేల పెట్టె?

తానువరూథినీనామకవేశ్యాచరిత్రమును వ్రాయఁదలఁచుకొనినవాఁ డగుచోఁ దనకావ్యము మనుచరిత్ర మని యేలనుడివె నందు రేని గణికాచరిత్ర మనిన లోకమునకు వెగటుగా నుండుటయును విలువ లేకుండుటయును గల్గు నను భీతిచే నిదియొక ఘనునిచరిత్రమే యనుభ్రాంతిని గల్గించుటకై మనుచరిత్ర మనుపేరునిడి తుదిని గొన్నిపద్యములతో విష్ణుస్తుతి నతికె. ఈకథ మార్కండేయపురాణోక్తము కావలె ననేల ?

ఈకథను మార్కండేయపురాణోక్తముగాఁ జెప్పు మని రాయలు కోరినట్లుగా, పెద్దనార్యుఁడు వ్రాసెను. అట్లు కోరుటలోఁ గూడఁ గొంతరహస్యము కలదు. మనువుయొక్క చరిత్రమును వర్ణించుటయే పెద్దనార్యుని ముఖ్యోద్దేశ మైనయెడల నయ్యది మార్కండేయపురాణోక్త ప్రకారముగా నుండవలె నని ప్రత్యేకముగాఁ గోరుటలో సారస్యము లేదు. ఏమన-స్వారోచిష మనుసంభవకథ శ్రీమద్భాగవతాదులందును గలదు. దాని నేల తీసికొనరాదు ? మనపెద్దనార్యునకుఁ గావలసిన వేశ్యాప్రశంస దానిలో లేదు. అందు స్వారోచిషుఁ డగ్నికిఁ బుట్టినట్లుగాఁ దెలుపఁబడియున్నది. వరూథినీనామకవేశ్యావృత్తాంతము లేనే లేదు. అందుమూలముచే నయ్యది త్రోసివేయఁబడినది. న్యాయముచే స్వారోచిషు నొకఘనునిగాఁ జెప్పఁదలచుకొనినయెడల మార్కండేయపురాణోక్తక్రమము తీసికొనఁదగినది కాదు. ఏమన-నందు స్వారోచిషుఁడు వేశ్యాసంతతిలోనివాఁ డని తేలు

చున్నది. స్వరోచి లంజకొడుకని మనరావుగారి రామచంద్రరావు పంతులవారే వ్రాసినారు. ఇట్టియనుచితసంబంధమును బ్రధానముచేసికొని మార్కండేయపురాణోక్తక్రమ మనుసరించుటకంటెఁ బరమపవిత్రుఁ డగునగ్నిహోత్రుని పుత్రుఁ డని తెలుపు కథను దీసికొనుటయే శ్రేయస్కరముగా నుండునుగదా! అయినను బెద్దనార్యునకుఁ గావలసినది వరూథినీనామక వేశ్యాప్రశంసకాని మఱి యొకటికాదు. ఆహేతువుచే మార్కండేయపురాణోక్తకథ ననుసరింపవలసివచ్చినది. ఈకథనుబట్టి వేశ్యాసంతతులు పూర్వకాలమునందును ఘనస్థితిలోనికివచ్చెడివారని తేలుననియెడి తలంపున స్వప్రయోజనార్థమై మార్కండేయపురాణోక్తమైన కథను జెప్పుటయే ప్రధానముచేసికొనియెను. కాని యామార్కండేయపురాణములో వేశ్యలఘనతకు నడ్డువచ్చుభాగము లేవియైన నున్నయెడలవానిని ద్రోసిరాజని వారల కనుకూలించు రీతిగాఁ గ్రొత్తవ్రాఁతలు వ్రాసెను. ఎట్లన :—

ఇప్పట్టున మార్కండేయపురాణమును బెద్దనార్యునకు వ్యతిరేకముగానే యున్నది. వేశ్యాసంపర్కము కూడ దని యీపురాణమును గట్టిగ నిట్లు నిషేధించుచునేయున్నది.

శ్లో. " పరస్త్రీయం నాభిలషే. దిత్యూచు ర్గురవో మమ।
తేన త్వాం నాభివాంఛామి కామం విలప శుష్యవా ".

దీనిని మారన యిట్లు తెనిఁగించెను.

కం. " పరవనితారతి కీడని, గురులెఱిఁగింతు రటుగాన గోమలి మది నా
కు రతిజనింపదు నీదెస, నిరతము నాదెస భజింపు నీవును విరతిన్".

ఇవి వరూథినితోఁ బల్కినపల్కులు. దీనింబట్టి వేశ్యారతియును బరవనితారతియే యనియును గావునఁ బాపదాయకమే యనియును దేలుచున్నది. ఇటఁ బరవనిత యనఁగా భార్యకంటెఁ బరురా లైన వనిత యని యర్థము. భార్యకంటెఁ బరురాండ్రైన స్త్రీలెల్లరును నభిలషింపఁ దగనివారే కదా? వేశ్యమాత్రము స్వస్త్రీకంటె భిన్నురాలు కాదా? మానవుఁడు వివాహమాడునపుడు ధర్మార్థకామవిషయములలో నిన్నతిక్రమింప నని భార్యకు వాగ్దానము జరిగియుండును గదా. స్వస్త్రీనే కాని పొందఁగూడదు కదా. ఏవిధమునఁ జూచినను, వేశ్యాసంపర్కము నిషిద్ధమై తీరుచున్నది. ఏపురాణమును ప్రధానముగాఁ జేసికొని పెద్దనార్యుఁడు తన ప్రబంధమును విరచించెనో యాపురాణమే వేశ్యారతి కూడ దనియు నందుమూలముచేతనే భూసురాగ్రణి యగు ప్రవరాఖ్యుఁడు వేశ్య యగు వరూథినిని ద్రోసి

వేసె ననియు విస్పష్టముగఁ దేలుచుండఁగా నాభావము నంతను దిరస్కరించివైచి పైఁగఁ దనప్రబంధములో వేశ్యారతి యుచితమే యనుభావమును సూర్యాస్తమ యవర్ణనము చేయుమిషపై పెద్దన యిట్లు తేల్చె.

చ. "తరుణి ననన్యకాంత నతిదారుణపుష్పశిలీముఖవ్యథా
భర వివశాంగి నంగభవుబారికి నగ్గముసేసి క్రూరుఁడై
యరిగె మహీసురాధముఁ డహంకృతితో నని రోషభీషణ
స్ఫురణ వహించెనో యన నభోమణి దాల్చెఁ గషాయదీధితిన్".

దీనింబట్టి వేశ్యను గూడవచ్చు నని తేలుచున్నది. ఇది మూలవిరుద్ధభావ మని యిదివఱకే చెప్పినాను. ఇది కవివాక్యము కాని పాత్త్రోచితవాక్యము కాదు. ఇందులో వేశ్యను గూడవచ్చు ననుటకుఁ దగు హేతువు గూడఁ దెలుపఁ బడి యున్నది. అదియేదియన 'అనన్యకాంతే' యగుట యంట. అనన్యకాంత కావునను దనయందలి మోహముచేఁ బరితాపముపాలై నవయుచున్నది కావునను, ప్రవరుఁ డు వరూథినిని బొందవలసినదే యని పెద్దనార్యుఁడు సిద్ధాంతము కావించె. ఆమెను బొందనందులకై సర్వోత్తముఁడగు నాభూసురాగ్రణిని మహీసురాధముఁ డనియుఁ గ్రూరుఁడనియు నిందించెను. న్యాయముచే వరూథిని దేవవేశ్య, కాని, పెద్దనార్యుఁ డిచట దేవత్వమును బ్రధానముగాఁ దీసికొనలేదు. ఈపద్యము మన భూలోక మందలి వేశ్యల కన్వయించుటకై తరుణీ త్వానన్యకాంతాత్వములను మాత్రమే తీసికొని, యవి కలవు కావున వేశ్యను గూడవచ్చు నని పెద్దనార్యుఁడు తేల్చెను. చిన్నాదేవి తరుణియు ననన్యకాంతయుఁ గావునను దనయందు వలపు పెట్టుకొనినది యుఁ గావునను గరుణార్ద్రహృదయుఁడైయామెను కృష్ణదేవరాయలు పాలించుట సర్వవిధముల నుచితముగనే యున్న దని లోకము భావించుకొనునట్లు చేయుట కై పెద్దనార్యుఁడు తనకవితాచాతుర్యము నంతయుఁ జూపెను. ఈపద్యము దుర్నీతి దాయకముగా నున్నదని మన శ్రీ టేకుమళ్ల అచ్యుతరావుగారే యంగీకరించిరి. కనుక దానిని గుఱించి యంతగా వ్రాయ నవసరము లేదు. వేశ్యలప్రశంస యున్నం దులకే యాముక్తమాల్యదాదుల రావుగారు నిందించిరి. అట్టిస్థితిలో వేశ్య లనన్య కాంతలు కావున వారిని గూడవచ్చు ననియు నాతరుణుల విరహతాపము పాలు చేయుట క్రూరత్వమును నధమపురుషత్వమునై యుండుననియు లోకమునకు బోధ చేయుచున్నమనుచరిత్రము నేమనవలెనో చదువరులే యూహించుకొందురుగాక.

వేశ్యను గూడవచ్చునని తెల్పుటయే గాక యామెను గూడక త్రోసివేసిన ప్రవరాఖ్యవిద్వన్మణిని మూర్ఖుఁ డని మనకవి నిరసించి వైచె. గణికాసంభోగము దర్మయుతమే యైనచో విజ్ఞుఁడగు ప్రవరాఖ్యుఁడు వరూథిని నేల త్రోసివేసె ననుశంక కలుగునుగాన, దత్పరిహారార్థమై యాప్రవరుఁడు వేశ్యాసంభోగములోని చాతుర్యము నెఱుంగని యవిదగ్ధుఁడుకావున నట్లుచేసె నని పెద్దనార్యుఁడు తేల్చె.

జ్ఞాని యగుప్రవరుని మూర్ఖునిగా స్వలాభార్థమై పెద్దనార్యుఁడు నిరూపించుటయే గాక సిక్కమైన రసికతలేని కాముకాధముఁ డగు కలినామక గంధర్వబ్రువుని- అంగభవవిద్యాపారగుం డని స్తుతించె. ఏవిధముచేత నైన వేశ్యను గూడినవాఁ డెవఁడో వాఁడే రసికాగ్రణి యని పెద్దన సూచించె.

వరూథినీనామక ధననారి సురతక్రీడను సరసముగ సాగించుస్థితిలో లేకున్నను నామెతోడి ప్రథమసురతము నాయకుని సంతోషింపఁ జేయఁ గలిగిన దని పెద్దనార్యుఁడు వివిధసురతవర్ణనములద్వారముగా లోకమునకు బోధచేసె.

మనకవి కులస్త్రీగర్భాధానవర్ణనము చేయవలసి వచ్చుస్థితిని దెచ్చిపెట్టి యావర్ణనమును సర్వవిధములఁ బాడుసేసె. అది మనోరమాస్వరోచుల గర్భాధానముతో సంబంధించిన విషయము. ఈ గర్భాధానపుగదిలో నాయిక యగు మనోరమచే నేడ్పించియును గొంతేసమ్మకోర్కెలు కోరించియును దుదకు గర్భాధానమే చెడి కార్యము రసాభాసమై పోవునట్లు చేసెను. ఇది పెద్దనార్యుఁడు బుద్ధిపూర్వకముగాఁ దెచ్చిపెట్టిన రసాభాసము.

వారాంగనలు కామశాస్త్రతంత్రజ్ఞలై హెచ్చగు లోకజ్ఞత కల్గియుందురు. కావున వారితోడి సంభోగ మతిమనోహారముగా నుండుననియు నట్టి ప్రౌఢత కవకాశము లేక కులస్త్రీలు సమయానుకూల సరసత లేనివారై యేడ్చియును బెంకిపట్లు పట్టియును నాయకులమనస్సులకు నిక్కమగు నానందము కలుగఁజేయఁ జాలకుందు రనియుఁ బెద్దనార్యుఁడు లోకమునకు స్ఫురింపఁజేసెను.

ఈపను లన్నియు వేశ్యాప్రియాగ్రణి యగు రాయలవారిని సంతోషపెట్టుటకై పెద్దనార్యునిచే సాహసపూర్వకముగాఁ గావింపఁబడినవి. ఈసంగతిని మన రావుగారును నెఱుంగుదురు. కావున "ఆకాలమున రాజులు శృంగారరసప్రియులగుటచేఁ దదాశ్రితు లగు కవీశ్వరులును శృంగారరసలాలసులు కావలసివచ్చినది" అని వ్రాసిరి. దీనింబట్టి మనకవి, రాజేచ్ఛ యెట్లున్నదో యట్లు వ్రాసి ప్రభువును సంతోషపెట్టఁ బ్రయత్నించినాఁ డని తోఁచుచున్నది. కావుననే దేశోద్ధారక నాగే

శ్వరరావుపంతులుగారు "విశ్వశ్రేయస్సునకు సాధనమైన కావ్యప్రయోజనమును రాజాశ్రయము సంకుచితముగ జేసినది." అనియుఁ "గావ్య మంతయు గామపరమై కావ్యప్రయోజనమును సంకుచితము చేసినది." అనియు వ్రాసినవ్రాతలు యథార్థము లగుచున్నవి. మనకవి నీతిని దనయిచ్ఛవచ్చినట్లు ద్రిప్పి పాడుచేసి దానికి సరిపడుటకై రసమునుగూడఁ బాడుచేసె.

మనరావుగారు "పెద్దనవలెనే యతని సమకాలికు లగుముక్కుతిమ్మన్న ధూర్జటి వారివెనుక సమీపకాలములో వెలసిన రామరాజభూషణుఁడు పింగళి సూరన్న యిత్యాది మహాకవులందఱు శృంగారరసభూయిష్ఠంబు లగు గ్రంథములను రచించిరి." అని వ్రాసి పెద్దన్నశృంగారరసము చిత్రించుటలోఁ దనకాలమునఁ బ్రకటితమగు రుచిప్రమాణముల మించిపోలే దనుభావమును దెల్పిరి. ఇది సరికాదు. పైన రావుగారిచేఁ జెప్పఁబడిన యాకాలపు కవు లెవరును శాస్త్రములఁ ద్రుణీకరించి సదాచారము నతిక్రమించి నీతిని పదటఁగలిపి వెలయాలిపొత్తు మంచిదే యనియు రసికత యందే యున్న దనియు శుద్ధవైరాగ్యము పూనుట మూఢత్వమనియుఁ బెద్దనవలె హేతువాదము పెట్టలేదు. కావున నాకాలపు రుచిప్రమాణముల మించియే పెద్దనార్యుఁడు శృంగారవర్ణనమును గావించె ననకతప్పదు. ఇట్టికారణములచే, పెద్దనగ్రంథ మసత్కావ్య మగుచున్న దని నేను వ్రాసితినే గాని "వెలిపెట్టిరే బాడబుల"ను దానిం బట్టియును గచకుచాదుల వర్ణనములను బట్టియును గాదు. ఆకాలపరిస్థితులే యీయంశమును దెల్పుచున్నవి. పెద్దన వేశ్యాగమనమును సమర్థింపఁ దనగ్రంథమును వ్రాసెను గావునను మనపెద్దలు వేశ్యాగమనమునుఁ బరుగమన తుల్యముగా నెంచిరి గావునను రావుగారును వేశ్యాసంభోగము పశుకామములోఁ బడు ననిరి కావునను పెద్దనకృతి పశుకామబోధక మనియు నీతిబాధక మనియు నిస్సంశయముగా మనము చెప్పఁకొనవచ్చును.

అనన్యకాంతలు గావున వేశ్యలఁ గూడుట తప్పుగా దని పెద్దనార్యుఁడు సరసముగఁ జేసిన కాంతాసమ్మితబోధ లోకమునకు నమిత మగు హానిని గలిగించుచున్నయది. ఎంతటిమహనీయులు పెద్దనపక్ష మవలంబించి వేశ్యలఁ గూడుట అంతగా దనియుఁ దప్పుగా దనియు గట్టివాదము గావింప మొదలిడిరో గనుఁగొనుఁడు. శ్రీ వెన్నేటి రామచంద్రరావుపంతులు బి. ఏ., బి. యల్. గారు, శ్రీ న్యాపతి శేషగిరిరావుపంతులు బి. ఏ., బి. యల్. గారు, శ్రీ ఓరుమళ్ళ అచ్యుతరావు పంతులు ఎం. ఏ., ఎల్. టి. గారు, కేతవరపు వేంకటశాస్త్రిగారు మున్నగు హేమా

హేమివారెల్లరును వేశ్యాసంభోగమును మనఃపూర్వకముగా సమర్థింపఁ బడఁగల పాల్లెలఁ బడుచున్నారు. ఈయంశము చాలదా మనుచరిత్రము పరిమళము గల విషపుష్పమువలె లోకమున హానిచేయుచున్న దని చెప్పుటకు ?

మన శ్రీమదచ్యుతరావుగారికి కలినామకగంధర్వుఁడు వరూథినిని మోసగించి కావించిన యక్రమసంభోగ మవినీతినిరోధకమై ధర్మమే యగుచున్న దఁట! వారివాక్యరత్నములనే యీ క్రింద నిచ్చుచున్నాఁడను.

“వరూథినీప్రవరుల కథ నీతిబోధకము, వరూథినీమాయాప్రవరులకథ యవినీతినిరోధకము, నీతిప్రబోధము నవినీతినిరోధము నీరెండును గావ్యేందిరయొక్క ధర్మైకచరణము నందలి యాకృతిద్వయమే.”

ఈయపూర్వనీతివాక్యములను రావుగా రేలోకమునుండి పలుకఁజొచ్చిరో తెలియవచ్చుటలేదు. ఏమన-కలిగాఁడు చేసినదారుణకృత్యము లవినీతినిరోధకములై ధర్మమెట్లైనవో దురూహ్యములుగా నున్నయవి. ఈభూలోకములో నాతఁడు కావించినది మంచిపని యనుట కవకాశము లేదు. రావుగారివాక్యము భావరసము లేని శుష్కపల్లీబంధము.

మోసము చేసి వరూథిని యనువేశ్యతో కలి కూడినాఁ డని యిదివఱకే వ్రాసినాను. ఆకూడుట తనకొఱకా యామెకొఱకా యనఁ దనకొఱకే. స్వార్థపరత్వముతో వంచనకృత్యమును గావించినాఁడు. ఆమె పరితాపమును దీర్చుటకుఁ గాదు. తన్నుఁ ద్రోసివేసిన యావేశ్య ప్రవరునియందు మోహము పెట్టుకొని యాతఁడు లభింపమిచే మన్మథాగ్నిలో వేఁగుచున్నందులకై యీతఁడు చాలసంతోషించినాఁడు, కాని, విచారపడలేదు. తాను దొంగయై యాప్రవరవేషము వేసికొని యామెను గూడుటకు నవకాశము చిక్కినది గదా యని సంతోషించి యావేషమును దాల్చెనే కాని యామెప్రాణము నిలుపుటకుఁ గాదు. మార్కండేయపురాణ మట్లే చెప్పుచున్నది. నావ్రాసినదాని నెట్లైన కాదనుటకై రావుగా రొకవిచిత్రమైన యెత్తు నెత్తిరి. వరూథినియును నీగంధర్వుఁడును దేవలోకములోనివా రంట ! అందుమూలముచే మనభూలోకధర్మము లచటఁ బనికిరావంట! ఇది దోషమును దోష మని యొప్పుకొనక లోకవంచనము చేయుటకయి వ్రాసిన మోసపువ్రాఁత. ఏమన:- నాకిచ్చిన సమాధానములో వీరు కలిగాఁడధర్మనిరోధద్వారముగా ధర్మప్రబోధమే గావించె నని ముగ్ధవాదము గావించినను దాము లిఖయించిన యాముక్తమాల్యదావిమర్శనములో వీఁడు వరూథినీసౌశీల్య

మును బాడుచేసె నని "వరూథిని తనయైంద్రియభోగేచ్ఛకు బానిసయయి కుహనాప్రవరునిమాయలలోఁ బడి తనశీలముఁ గోలుపోయెను." అని వ్రాసిరి.

దీనింబట్టి వరూథినీనామకరూపాజీవకు శీలమున్నట్లును నయ్యది కుహనాప్రవరుఁడగు కలిగానిమూలముగా ధ్వంసము చేయఁబడినట్లును దేలుట లేదా? ఇది యధర్మనిరోధకమును ధర్మప్రబోధకమును నగు పని యెట్లు కాఁ గలదు. అది యట్లుండ నిండు, ఎవ్వతెయైన ననుచితకామోదయయై దానివలన బాధపడుటతటస్థించిన దానిబాధను దొలఁగింపకుండుట కవి కుచితము గాదనియు, నాభోగపరాయణురాలికి నింద్రియైకసుఖవ్యాపారపారగు నొకనిని దగిలించి యామె నీచేంద్రియవాంఛను దీర్చుట కవిపని యనియు, ఇదియే కావ్యనీతి.(Poetic justice) యనియు రావుగారు వ్రాయసాహసించుటకు వెనుదీయరైరి! కామాంధునకుఁ గామాంధురాలిని, గామాంధురాలికిఁ గామాంధుని గూర్చుట కవిపని యగునా? అట్లైన వాల్మీకిమున్నగువారు మనరావుగారు చెప్పినకావ్యనీతి(Poetic justice) నెఱుంగక రామాయణాదులఁ బాడుచేసి రని చెప్పవలెనుగదా! రావణుఁడు చెఱకువిలుకానికఱకుటమ్ములఁ దూలి విరహార్తుఁడై సీతావిరహదుఃఖాబ్ధిలోఁ బొరలుచుండెను. సతీమణి యగుసీత పాతివ్రత్యధర్మముతో వఱలుచుండెను. ఇంక నాకాముకుని యవస్థ నెట్లుపాపవలసియున్నది. అతఁడు సీతాదేవికొఱ కేడ్చుచుఁ జావవలసినదియా? ఆయింద్రియైకభోగపరాయణునకు నింద్రియైకసుఖవ్యాపారపారగురా లగునొకకాముకురాలిని సీతావేషము వేసి కవి తగిలింపవలసినదికదా? అపుడుకదా రావుగారి కావ్యనీతి శోభించును! కావ్యనీతి యన నిట్టిది కాదు. దుష్టులు చేసిన దుష్టకృత్యములకుఁదగినశిక్ష నందుటయు సుకృతు లగువారు తాము చేసిన సుకృతములకుఁదగిన సత్ఫలము నందుటయుఁ గావ్యమునఁ గలిగించుట కావ్యనీతి యని ప్రాజ్ఞులువ్రాసియుండిరి. గ్రంథమునందు కావ్యనీతి కలదా లేదా యని విచారించుట కలవాటుపడిన పాశ్చాత్యపండితు లీవిషయమై యిట్లువ్రాసిరి.

Poetic justice:—'That ideal justice which poets exercise in making the good happy, and the bad unsuccessful in their evil schemes.' —Brewer's Phrase & Fable.

'A distribution of rewards and punishments such as is common in poetry and works of fiction but hardly in accordance with the realities of life.' —Annundale.

ఈరీతిగానే New Century Dictionary లోఁగూడఁ గలదు.

వీనింబట్టి రావుగారు వ్రాసినది పూర్తిగాఁ దప్పని తేలుచున్నది. రావుగారికి సత్యముతోఁ బనిలేదు. చేతికి వచ్చినట్లు వ్రాయుటయే మచ్చువిమర్శనము వ్రాయుట యని భావించిరి కాఁబోలు !

వరూథినిని నామెనుగూడిన గంధర్వాధముని విమర్శనమునుండి తొలఁగించుటకై రావుగారిక నొక యెత్తు నెత్తిరి. దేవలోకసామాన్య యగునంగన నాయిక యగుటచే నామెపలుకులుఁ జేతలు మానవజాతికి సంబంధించినవి కావఁట. అట్లే మాయాప్రవరుని చేష్టాదికమును నంట! ఇట్లు వ్రాసి తుదకు దేవతలనైనను మనుష్యజీవితవృత్తులలో నున్నలక్షణములతోఁ జిత్రించుట చాల మేలే యని యంగీకరించి తుద కట్లు చేయుటచే వారియందు దేవతాగుణములను దప్పించి మానవగుణముల నారోపించుట యగును గాన నట్లుచేయరా దని రావుగారు తేల్చిరి. ఇదియుఁ దప్పు వ్రాఁతయే. మానవుఁ డగుకవి వ్రాయుగ్రంథములో దేవతలనుగూడ మానవత్వములోనికిఁ దీసికొనిరాకుండ నుండఁజాలఁడు. పెద్దనార్యుఁడు వరూథినిని మనుచరిత్రలో మానవత్వములోనికిఁ దెచ్చితీరినాఁడు. మానవదేహములందుఁ గలుగుస్వేదోద్గమము తెప్పపాటు మున్నగువానిని వరూథినీవిషయములో వర్ణించితీరినాఁడు. అదిగాక యాదేవాంగన చచ్చిపోవునేమో యను భీతిని గంధర్వుఁడు పెట్టుకొనినాఁ డని పెద్దన లిఖించె. అంతమాత్రముచేఁ బెద్దన గ్రంథమును నిందించివేయవలెనా ?

—: నెరసుల నెంచుట. :—

నేను నెరసుల నెంచినట్లుగా రావుగారు నాపై దోషారోపణము గావించిరి. నే నట్లు చేయలేదు. నేను జూపినవి వట్టినెరసులు కావు, కథాశిల్పమున కడ్డువచ్చు విరళబంధము లని వేనిని రావుగారు భావించిరో యట్టివానినే నేను మనుచరిత్రలోఁ జూపితిని. రావుగారి మెప్పువడసిన దండ్యాచార్యులవారు,

"శ్లో. తదల్పమపి నోపేక్ష్యం కావ్యే దుష్టం కథంచన
　　స్యాద్వపు స్సుందరమపి శ్విత్రే ణైకేన దుర్భగమ్"

అని నుడివి యుండిరి. కాన విమర్శకుఁడు స్వల్పదోషములను గూడఁ జూపఁదగినదే. రావుగారు విష్ణుచిత్తీయవిమర్శనములో నెరసు లని తామే పేర్కొనిన దోషములనుగూడ నెంచితీరిరి. అ ట్లేల చేయవలసివచ్చె ? తా మేదిచేసినను జేయవచ్చునేమో? నెరసులని త్రోసివేసినంతన యున్నదోషములు తొలఁగిపోవు.

వసుమనుచరిత్రలంగూర్చి నాకును శ్రీ వెన్నేటి రామచంద్రరావుపంతులుగా

రికిని జరిగినచర్చమాట నత్తికొని పంతులవారి వ్రాఁతలు మృదుత్వము తప్పలేదనియు నా వ్రాసినది విరసోక్తులతోఁ గూడియున్నదనియు శ్రీరావుగారు లిఖించిరి, యిది నాయందుఁగల ద్వేషభావము వ్రాయింపఁగా వ్రాసినవ్రాఁత. నేను నా మాట చెప్పుకొనఁదగదుకదా! ఇంక రామచంద్రరావుపంతులుగారి వ్రాఁత లెంత మృదువుగనున్నవో చూపెదను గనుఁడు. పంతులువారు మనుచరిత్రమునందలి నాయిక యగు వరూథినిం గూర్చి ముచ్చటించుచు "బ్రహ్మయ్యగారిలంజ" యని వ్రాసిరి. ఆపె మనుచరిత్రపక్షము వహించిన పంతులవారిలంజ యనిన ననవచ్చునేమో కాని వసుచరిత్రపక్షమున వ్రాసిన నాలంజ యెట్లు కాఁగలదు. పంతులవారి వ్రాఁతలో మార్దవమును లేదు చాతుర్యమును లేదు. ఇట్టి పరుషవాక్కులు వారివ్యాసములోఁ బెక్కులు కలవు. అయినను బక్షపాతబుద్ధి వానిని గనఁబడనిచ్చినది గాదు. నా వ్రాసినదానిలో లేని లోపములను జూపినది. పక్షపాతము వదలకున్న విమర్శనములు బాగుపడవు.

కావ్యములందలి గుణదోషముల నెంచుట సత్కావ్యములు పుట్టునట్లు చేయుటకే. ఈయంశమును పెద్దనార్యుఁడే "నిరుపహతిస్థలంబు" అను పద్యములో విశదముచేసి యున్నాఁడు. ఒప్పుతప్పరయు రసజ్ఞులుండవలె నన్నాఁడు.

దీనిలో, ఒప్పుతప్పరయురసజ్ఞు లుండినం గాని యూరక కృతుల్ రచియించుట కవకాశముండునా యని తెలుపఁబడి యున్నది. నిజముగా మంచివిమర్శనములు మనసారస్వతమున వలయునన్ని లేకపోవుటచే వాఙ్మయాభివృద్ధినే ప్రధానముగాఁ జేసికొని నేను విమర్శనముల వ్రాయుచున్నాఁడను. నాలోపము లున్నఁ జూపవచ్చును. రావుగారు వృథాగా నన్నేలనిందింప మొదలిడిరో తెలియవచ్చుటలేదు. నే నెచ్చటను బెడసరపువ్రాఁతలు వ్రాయకపోయినను నన్నుదూఱుటకుఁ గారణము గాన్పించుటలేదు.

శ్రీ రావుగారు పెడసరపువ్రాఁతలు వ్రాయుటయం దభిలాష గలవారుగాఁ గాన్పించుచున్నారు. ఆంధ్రభాషాపోషణ మొనరించిన మహనీయులలో నగ్రగణ్యు లగు రాయలవారి విష్ణుచిత్తీయముపై విమర్శనమును వ్రాయుచు రాయలవారినిగూర్చి యుక్తాయుక్తముల నెంచక పెడసరపువ్రాఁతలు చాలవ్రాసిరి. ఒకటి రెండుదాహరణముల నిచ్చెదను.

(1) ఈవిషయమై రావుగారు, "ఈచక్రవర్తికి నేలకో సంగీతజ్ఞానము సున్న"అని వ్రాసిరి. ఆచక్రవర్తికి సంగీతజ్ఞానము లేదని వీరెట్లు గ్రహించిరో! కవిత్వ

ము కఠినపాకము కలిగి యుండుటచేత నంట. బహువిధకళాపోషకుండై నిరంతర మును దదభిరుచితో మెలంగిన చక్రవర్తి సంగీతజ్ఞానశూన్యుఁడగుట కలుగ నేరదు. కాన తగినకారణము చూపకయే యాతనికి సంగీతజ్ఞానము సున్నయని యూహించుట గొప్పసాహసము. మునురుపాకమునఁ గవిత్వముచెప్పువారిలో సంగీత రహస్యజ్ఞు లనేకులు కలరు. పద్యకవిత్వమువలెనే వాగ్గేయకవిత్వమును మునురు పాకమం దుండవచ్చును. అది గాక, ఆముక్తమాల్యదంబట్టి చూడ వీరికి సంగీతజ్ఞానము సున్నయనఁదగినదిగాఁ గాన్పించుటలేదు. ఈపద్యముంగనుఁడు.

ఉ. కామిని మేఘరంజి మహుగర్వమునంతు నటంచు లో నిజ
క్షేమముఁగోరి పాడి మణిచిత్రమరుత్తృణతౌచిరద్యుతి
స్తోమవలాహకావలులు దోఁచి ప్రఫుల్లకదంబకేతకో
ద్దామసమీరణాహతులఁ దాపమునీ నొలుగు న్విచేష్టతన్.

చ. కలఁ డొకరుండు వేసకొనఁగానికులంబు మదీయభక్తుఁ డి
య్యల మును వాఁడు వామనత నే వసియింపనొ పుణ్యభూమి నం
దుల కొకయోజనత్రయపు దూరపుటూర వసించి బ్రహ్మవే
ళలఁ జనుదెంచి పాడు మము లాలన మంగళనామకైశికిన్.

రాయలవారి కావ్యపాకముం గూర్చి కళాపరిపూర్ణ వేదము వేంకటరాయ శాస్త్రిగారు ముచ్చటించుచు నయ్యది పక్వపనసఫలపాకముననున్న దనఁగా-నం దుపైన రావుగారు విరసపువ్రాఁతలు చాలవ్రాసిరి. పనసలలో బురదపనస యొకటి కలదఁట. అందు పీచేగాని మఱేమియు నుండదఁట. ఆబురదపనసపాకమున నున్న దని రావుగారు గేలిచేసిరి. ఆభాషోద్ధారకుని, ఆమహాకవిని, ఆపండితపోషకుని నీవిధముగ గేలిచేయుట న్యాయమా? నిజముచే విష్ణుచిత్తీయములో సహృదయ హృదయోల్లాసమును గలిగించు పద్యరాజము లనేకములు గలవు. అట్టిదాని యందు మాధుర్యమేమియు లేదనియు గ్రంథము బురదపనసపాకమున నున్నదని యు నుడువుట యుచితమా? ఇంతయేల గ్రంథనామమే సరిపడలేదనిరి. విష్ణుచిత్తీ య మనుపే రుండఁగూడదఁట. విష్ణుశక్తీయమనియో విష్ణుభక్తీయ మనియో యుం డవలయునఁట. ఇట్టిపిచ్చి యాక్షేపణము లాముక్తమాల్యదపైఁ బెక్కులు గావించిరి.

పెద్దనార్యునియం దెంతయో యభిమానము పెట్టుకొని యెంతయో పక్ష పాతమును జూపిన రావుగారు తుదకు—పెద్దనార్యునివిషయములోఁగూడఁ దమ సహజలక్షణముం బట్టి పెడసరపువ్రాఁతలు వ్రాసిరి. "మనుచరిత్రరచనములో

నేవిధ మగు స్వాతంత్ర్యమును పెద్దనార్యునకు లే దని వీరు వ్రాసిరి. ఆమహాకవిని వట్టిబానిసను జేయుటకాదా ?

(2) పెద్దనార్యుఁడు గావించిన సూర్యాస్తమయవర్ణనమునుగూర్చి వ్రాయుచు "పెద్దనార్యుని శృంగారరస మిచటఁ బొంగి పొరలినది. శ్రీ శాస్త్రిగారి చీవాట్లకుఁ బెద్దన్న యిచ్చటఁ దప్పక యర్హుఁడే" అని లిఖయించిరి. పెద్దనయందు గౌరభావము కలదనుకొను వీరు పెద్దన్న చీవాట్ల కర్హుఁడే యని వ్రాయుట వింత కాదా ? పెడసరపువ్రాఁతలు వ్రాయుట వీరికి సహజ మగుటచే నిట్టివిరసపువ్రాఁతను వ్రాసిరి. ఇట్టివనేకములు కలవు.

మొత్తముమీఁద రావుగారిప్రతివిమర్శన మంతయుఁ జెడినది. వారు మచ్చు విమర్శనమును వ్రాయఁదలఁచుకొనఁగాఁ దుదకుఁ బిచ్చి విమర్శన మగుటకు సిద్ధమైనది. వీరు గొప్పవారే కాని వీరికిఁ దొందరపా టెక్కువనియు గ్రంథమును దిన్నగఁ జూచుకొన రనియు నే నిదివఱకే వ్రాసియున్నాను. ఆకారణమున విమర్శనము పాడైనది. బహుభాష లెఱింగిన పెద్దపండితులైన కారణమున వీరివిమర్శనము నిస్సారమైనను వీరియున్నతవిద్యయందుఁ గలగౌరవముచే వీరికి నేను సమాధాన మిచ్చితిని.

రావుగారు పురాణవిద్యలో గొప్పపండితులై యుండియు, నున్నతోద్యోగిమై యుండి యు మన యాంధ్రభాషయందు మంచియభిమానమును బెట్టుకొని చాలకృషి చేసి విమర్శనములు మున్నగునవి వ్రాయ మొదలిడుట చాల శ్లాఘనీయాంశము. పరమేశ్వరుఁడు శ్రీరావుగారికి దీర్ఘాయురారోగ్యోన్నతులను మంచి విమర్శనపాటవమును నొసంగుఁగాక. ఆంధ్రసారస్వతమును మహోన్నతదశ నొంది ప్రకాశించుఁగాక.

ఓం తత్ సత్.

ఈవ్యాసము శ్రీమదచ్యుతరావుగారు గావించిన యసంగతప్రసంగములకు సమాధానముగా వ్రాయఁబడినది. కాని యిది పెద్దనార్యుని మనుచరిత్రముపై సంపూర్ణ విమర్శనముగాదు. కాన పెద్దనార్యునిగ్రంథమునందలి గుణప్రశంసయిందులేదు. ఆహేతువుచే నాపొత్తమునందు త్తమగుణము లేవియు లేవని నేనుదలంచినట్లు భావింపరాదు. ఆమహాకవికావ్యములో సహృదయులు హృదయపూర్వకముగా "మేలు మేలు" అని మెచ్చుకొనఁదగిన భాగము లనేకములు కలవు. వాని నాతొలివిమర్శనములో విశదీకరించియే యున్నాఁడను. నే నప్పు డప్పుడు మనుచరిత్రముపై వ్రాసిన విమర్శనముల నన్నిటిని సచ్చరితులు చదివి చూచుకొని తరువాతఁ దమయభిప్రాయముల నేర్పాటు చేసికొనఁగోరుచున్నాను.

శా॥ బ్రహ్మయ్యశాస్త్రి.

జన్మదినోత్సవపద్యములు.

బ్రహ్మర్షి డాక్టరు. సర్. ఆర్. వేంకటరత్నము నాయుఁడుగారి జన్మదినోత్సవమున
శ్రీపిఠాపురము యువరాజావారు రచించి చదివిన పద్యములు.

సీ. పూవులువిచ్చినఁ దావులు విరిసినఁ బరమేశుమహిమయే ప్రజ్వలించుఁ
బికములు పాడిన వీణెలు మ్రోసినఁ బరమేశుమహిమయే ప్రజ్వలించుఁ
బవనుండు వీచినఁ బల్లవం బదరినఁ బరమేశుమహిమయే ప్రజ్వలించు
మేఘంబు లుఱిమిన మెఱపులు మెఱసినఁ బరమేశుమహిమయే ప్రజ్వలించుఁ
గీ. గాని, స్వార్థరహితుఁడయి కరుణ పొంగ, సర్వమానవసంసేవ సలుపునట్టి
భక్తవరునిజీవనమందువలె మఱెందు, నీశుమహిమ వెలుఁగఁజాలదెంచిచూడ.
ఆ. వె. రత్నరాశికంటె రజత పుగనికంటె, రమ్యదివ్యసౌధరాజికంటె
రాజ్యమహిమకంటె, రణజయోన్నతికంటె, విశ్వసేవకుండు విలువకాదె! 2
ఆ. వె. కాన, నోమహాత్మ! మాననీయము లైన, త్వచ్ఛరీరజీవితములు మాకు
విలువలేని వింతవిరజాజిదండలు, వాడకుండుఁగాక వానిపూలు. 3
గీ. ప్రమదమునఁ జేరు గగనమ్ము భరతపక్షి, వంతఁబొందదయ్యదిసుఖవర్తియెపుడు
నయిన, దానిఁజూడఁగ లేకయార్తిఁజెంది, వసుధపైనున్న జనుఁడెంతొ పరితపించు.
సీ. ప్రాణులప్రాణ మౌ పరమేశుఁ డిచ్చు నాయుర్వృద్ధి నీకు సర్వోపకార!
లోకరక్షకుఁ డైనలోకేశ్వరుం డిచ్చు నారోగ్యవృద్ధి నీకాత్మవేది!
శాంతస్వరూపుఁ డౌ సర్వేశ్వరుం డిచ్చు శాంతి వృద్ధియు నీకు సత్యవాది!
ప్రేమవారిధి యైన విశ్వేశ్వరుం డిచ్చు సౌఖ్యవృద్ధియు నీకు సౌమ్యశీల!
ఆ. వె. ఈవుమాత్ర మెపుడు నేమైనఁగానిమ్ము, మమ్ము వదలవలదు మఱియు మమ్ము
నుద్ధరింప నీవె యుండితీరవలయు, వేఱు తలఁపవలదు విదితనీతి.

శ్రీదేవీభాగవతము.

సుప్రసిద్ధపండితు లగు దాసు శ్రీరామపండితులు రచియించినది. శ్రీదేవీభాగవతమును వీరికంటె ముందు, ములుగు పాపయారాధ్యులును, తిరుపతి వేంకటేశ్వరకవులును దెనిఁగించి యుండిరి గాని వారిభాగవతములకంటె వీరిదియే ముందు ప్రకటింపఁబడినది. శ్రీరామపండితులు 1900 సంవత్సరమున నీమహాభాగవతాంధ్రీకరణమును బ్రారంభించి యైదునెలలలోఁ బూర్తిచేసినారనిన వారికవితాధార యెంతయనర్గళ మైనదో యుభయభాషాపాండిత్య మెంత మిన్న యైనదో చెప్పక చెప్పుచున్నది. శ్రీరామపండితులు లోకములో భాగవతముంగూర్చి వ్యాపించి యున్న యనవసరమైన శైవవైష్ణవ భేదవాదములను సప్రమాణముగఁ జక్కఁగా నిరసించిరి. వారి యభిప్రాయమిది:—

"ఈవిధముగ నొకపురాణమునందు నొకదానికిఁ బ్రాధాన్య మిచ్చి మఱియొక పురాణమునందు మఱియొక పురాణమునకుఁ బ్రాధాన్య మీఁబడినట్లు గానవచ్చుచున్నది.

దీని కొక వింతయేమి: వ్యాసుండు తానేదేవతనుగూర్చి యే కథ సెప్పెనో ఆకథకును ఆదేవతకును బ్రాధాన్యమిచ్చినది యెవ్వరికి దెలియదు. అంతమాత్రముచే నందొకటి ముఖ్యమనియు మఱియొకటి యముఖ్యమనియుం జెప్పుట యుచితమా. "సోర్ధ్వ పుండ్రముఖం దృష్ట్వా వ్రతం చాంద్రాయణం చరేత్" అనిచెప్పిన చోటనే "తిర్యక్పుండ్రధరం దృష్ట్వా చండాలమివ సంత్యజేత్" అని చెప్పలేదా. కావున నుభయపురాణములును ముఖ్యములే అని మనము గ్రహించుట యుచితముగా నున్నది. రెంటికిని లఘుత్వము చెప్పినను చెప్పవలసివచ్చును.

ఇంతకును వారివారి భక్త్యతిశయముల ననుసరించి భాగవతపురాణములు రెండింటిలో నొకదానిని వారువారు పురాణ మని యనుకొందురే కాని నాతాత్పర్యమందు రెండుభాగవతములును పురాణము లనియు వ్యాసప్రోక్తము లనియు పఠనీయములనియు నమ్ముచున్నాఁడను.

మహాయనియు ఉపయనియు భేదములు కల్పించుకొని ముఖ్యత్వాముఖ్యత్వములను జెప్పుట యుక్తము కాదని తలంచెదను."

ఈగ్రంథములో మొదట శ్రీరామపండితుల జీవితచరిత్ర సంగ్రహమును, బ్రహ్మశ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి శతావధానులుగారి యుపోద్ఘాతమును గలవు.

వెల రు 6 లు. బెజవాడ వాణీముద్రాక్షరశాలాధిపతులయొద్ద దొరకును.

సాహిత్యసభ.

ఆంధ్రసాహిత్యపోషణార్థమై పరిషత్కార్యస్థానమునఁ గూడ వివిధ విద్యావిషయములం గూర్చి పండితులచే నుపన్యాసము లిప్పించుట కర్తవ్య మను తలంపుతో, ది 2-2-1935 తేదిని, సాహిత్యసభ యొకటి కావింపఁబడినదిది. అందువిమర్శకాగ్రేసర బ్రII కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రిగారు భవభూతి యుత్తరరామ చరిత్రము నందలి ప్రధానరస మేది యను విషయముం గూర్చి యుపన్యాసముగావించిరి.

ఈనాటకమునందలి ప్రధానరసము "కరుణవిప్రలంభశృంగార" మని తేల్చిరి. వారియుపన్యాససారసంగ్రహము నీక్రింద నిచ్చుచున్నారము.

ఉత్తరరామచరిత్రమునందలి ప్రధానరసము కరుణవిప్రలంభశృంగారమా, కరుణమా యను వివాద మీనడుమ బైలువెడలినది. పరికించిచూడఁ గరుణమనుటకంటెఁ గరుణవిప్రలంభశృంగార మనుటయే సర్వవిధముల నుచిత మనితోఁచుచున్నది. కరుణవాదులు శ్రీరామునకు సీత మృతినొందిన దనుదృఢప్రత్యయము కలదు. కావునఁ బ్రత్యాశ కవకాశము లేదనియుఁ గాన నాటక ప్రధానరసము కరుణమే యనియు వ్రాసిరి. ఇది సరికాదు. రామునకు సీత మరణించిన దను దృఢప్రత్యయము కల దనుటకు నాటకములో నే యాధారమును లేదు. సీత పూర్ణారోగ్యస్థితిలో నుండఁగా నడవిలోనికిఁ బంపివేయఁబడినది. అట్లు పంపఁబడిన తరువాత నామె యేమైన దనువార్త రామునకు నేవిధమునను గూడఁ దెలియరాలేదు. అట్టి స్థితిలో నామె మరణించిన దను దృఢప్రత్యయ మాతని కెట్లు కలుగఁగలదు. ఆమె క్రూరమృగములతో నిండియున్న ఘోరారణ్యములో నేకాకినిగా విడువఁబడినది, గావున, నాక్రవ్యాదులచే భక్షింపఁబడిన దని రాముఁడు రూఢిగా నిశ్చయించుకొనె నని కరుణవాదులు వాదించుచున్నారు. అట్లు వాదించుట కవకాశము లేదు. ఘోరారణ్యములో సీత విడువఁబడుటచేఁ గ్రవ్యాదులచే హానికలుగునేమో యనుభీతి రామునకుఁ గలిగినఁ గలుగవచ్చును గాని తప్పక క్రూరమృగములచే నామె భక్షింపఁబడియె నను దృఢప్రత్యయమునకు రాముఁడు వచ్చి తీరవలసిన యవసరము లేదు. ఘోరాటవులలో నేకాకినులుగా విడువఁబడిన యబలలు సురక్షితముగా నింటఁ జేరి స్వనాథులను గూడుకొనుట లోకములో లేదా! దమయంతి, యట్టిది కాదా. ప్రథమవనవాసములో సీతయును మృతికి లోనుగాక బ్రతికియుండి తుదకు నాథునితోఁ గలిసికొనలేదా! ఇట్టి యనుభవ

ముగల రాముఁ డిప్పటున సీత మరణించె నని దృఢప్రత్యయము కలవాఁ డెట్లు కాఁగలఁడు? సీత మరణించె నను దృఢప్రత్యయము రామునకు లేనియెడల రాముఁ డేల తీవ్రశోకము పాలాయె నని కరుణవాదు లడుగుచున్నారు. "శోకముయొక్క తీవ్రతాతీవ్రతలను నిర్ణయించుట కష్టము. పూర్వకాలమందు సీతావియోగము కలిగినప్పుడు రాముఁ డేడ్చిన యేడ్పతి తీవ్ర మని "అపిగ్రావా రోది త్యపి దళతి వజ్రస్య హృదయం" అని యీ నాటకమునందే తెల్పఁబడినయది. రాముఁ డిక్కడనే గాదా యతితీవ్రముగా నేడ్చినాఁ డని సీత చిత్రకూటసందర్శనకాలమునఁ బలికినది. అప్పు డట్టి శోకముపాలైన రామునకు సీత మరణించె నను దృఢప్రత్యయము కలిగినదా. ప్రత్యాశ లేకపోయెనా! అది గాక యీకాలమున రాముఁ డేడ్పు సందర్భమున నాతఁడు శృంగారమునకుఁ గూడ నెడమిచ్చినాఁడు కాన నీదుఃఖమంత తీవ్రమే కాదు. రాముఁడే "అహాహా విస్మయములో మునిఁగి తేలుచున్న నాహృదయమునందలి సుఖదుఃఖాతిశయము విప్రలంభమువలెనున్నది." (యదయం విస్మయ పరిప్లవమాన స్సుఖదుఃఖాతిశయో హృదయస్య విప్రలమ్భః) అని జృంభకాస్త్రము లెఱిఁగి తనరూపుననుండు కుశలవులఁ గనుట లోనగు ప్రత్యాసలంబట్టి పలికె. సీత వియోగమున కిప్పుడు తానే కారణము గనుక హెచ్చుగా నేడ్చినాఁడు. "క్రవ్యాద్భిరంగలతికానియతం విలుప్తా" అని రాముఁ డెట్లు పలికెనందురా యివి వాసంతికతో జరిగిన ప్రసంగములోనివి. వాసంతిక, రాముఁడు సీతను విడిచె నను కోపముతోఁ గూడినదై యాతనితో విరసప్రసంగము చేసెను. రాముఁడును నామెకు హృదయమిచ్చి మాటలాడ లేదు. సీతను విడువుమని ప్రజలేల కోరి రని వాసంతిక యడుగఁగా నది ప్రజలకే తెలియునని రాముఁడు సమాధాన మిచ్చెనే గాని యున్న సంగతిని దెల్ప లేదు. లక్ష్మణుఁడు సురక్షితముగా నున్నాఁడా యని యడుగ దాని కొకపట్టున సమాధానమే యిచ్చినవాఁడుగాఁడు. పిమ్మట సీత యేమైనదని యామె యడుగ నామె తలంపుల కనుకూలముగా, నేమైన దననేల క్రవ్యాదులు భక్షించి యుండును, అన్నాఁడు. ఇది యాతని హృదయములో నున్న తలంపనుటకు వలను పడదు. అదిగాక "నియతం విలుప్తా" అని నియత మను నుత్ప్రేక్షావాచకమును వాడినాఁడు గావున నది యూహామాత్రము గాని యెఱిఁగియుండి పలికిన పలుకు కాదని స్పష్టమగుచున్నది. ఇది సందేహద్యోతకము కావచ్చునుగాని దృఢప్రత్యయద్యోతకముగాదు. రామునకు సీత కనఁబడుట లేదను నూహ కలదుగాని మరణించినదను నూహ లేదు. "నాశితప్రియతమః" అనఁగాఁ గనఁబడకుండునట్లు చేయఁబడిన ప్రియురాలు గలవాఁ డని యర్థము. కరుణవాదుల వాద మంతయు నిస్సా

రమగుచున్నది. ఇంతయేల, నాటకముంబరికించిచూడ సీతజీవించియే యున్నదను నిశ్చయము రామునకుఁ గలదనుట కనేకోదాహరణములుగలవు. వశ్యవాక్కుగల మహర్షులు సీత వీరమాతయగుఁగాక యనియు, పుత్రపూర్ణోత్సంగయై యుండఁగాఁ జూచు భాగ్యము పట్టుఁగాకయనియు నాశీర్వదించిరి. ఆయమోఘాశీర్వాదములనువిని రాముఁడు ధన్యులమైతి మని సంతసించె. మఱియును, అరణ్యమున నున్నప్పుడు సీతను గాఁపాడుటకై దేవతలకుఁగూడ సాధ్యముగాని కార్యములఁ జేయుశక్తి గలదని నాటకమున వర్ణింపఁబడిన గంగాదేవియును, పృథ్వీదేవియును రామునిచే గోరఁబడిరి. సీత గంగాతీరమున వాల్మీకియాశ్రమముకడ విడువఁబడియె. ఆశ్రమస్థానము లందుఁ గ్రూరమృగములు క్రౌర్యము దక్కి యుండు నని పెద్దలు చెప్పుదురు. ఇట్టియుంగరక్షలఁ గావించిన రాముఁడు వ్యతిరేకవార్తాదియును వినరాక యుండఁగనే సీత మరణించిన దని యెట్లు నిశ్చయించుకొనఁగలఁడు. సీత జీవించియే యున్నది, అందుకు నిదర్శనము లుండఁగా శ్రీరామచంద్రునకు సీత మరణించినదను నిర్హేతుకాభిప్రాయ మెట్లు కలుగును. ఇంతయేల! సీత జీవించియున్నదనుదృఢనిశ్చయము రామునకుఁగలదని నాటకమువేనోళ్ళ ఘోషించుచున్నది. అందుఁ బ్రధానమైనది, రాముఁ డశ్వమేధముచేయుట. తానుమృతపత్నీకుఁడనను తలంపుగలవాఁడే యగుచో నశ్వమేధ మెట్లుచేయఁగలఁడు, మృతపత్నీకుఁడగు విధురుఁడు కర్మాధికారము లేనివాఁడు. ఆతఁడు యాగముచేయుటకధికారముండదు. ఈయంశమును నాటకమే రూఢిచేయుచున్నది. రాముఁ డశ్వమేధము చేయు నను మాట యెచ్చట వచ్చినను నాతనికి సహధర్మచారిణి యెవ రనియు మరలఁ బెండ్లి యాడినాఁడా యనియుఁ బ్రశ్నలువేయఁబడుచు వచ్చినవి. దీనింబట్టి మృతపత్నీకుఁడు క్రతువు నొనరింపరా దని నాటకము తెల్పుచున్నట్లు స్పష్ట మగుచున్నది. కావున రాముఁడు సీతాప్రతికృతిం బెట్టుకొని యశ్వమేధ మొనరించుటచే నాతనికిఁ దనభార్య జీవించి యున్నదను దృఢనిశ్చయము కల దనుట స్పష్ట మగుచున్నది. కావుననే భార్యాప్రతికృతినిఁ బెట్టుకొని క్రతువు చేయవచ్చునను ధర్మశాస్త్రవాక్యములో జీవించి యుండియుఁ గ్రతువులోఁ బాల్గొనుటకు నవకాశము లేనప్పుడే ప్రతికృతిని బెట్టుకొనవలయునను విధి కాన్పించుచున్నది. భార్య విదూరస్థయై యున్నపుడు ప్రతికృతిని బెట్టుకొని క్రతువు చేయవచ్చునని శాస్త్రముబోధించుచున్నది. కావున రాముఁడట్లశ్వమేధముచేసెను. సీత, అయోధ్యకుసమీపమున నున్న వాల్మీక్యాశ్రమముననే యున్నదనిన కరుణవాదు లే తమమాటను రద్దుచేసి

కొని క్రతుకాలమున నామె పాతాళలోకమున నున్నదని చెప్పిరి. కనుక విదూరస్థమై యున్న దన్నమాటయే గదా! పరలోకమున నున్న భార్యయొక్క ప్రతికృతిని బెట్టుకొన వచ్చునెడల మరణించి పరలోకము నందున్న భార్యల ప్రతికృతుల నేల పెట్టుకొనరాదని కరుణావాదులు శంకించిరి. సీత యీదేహముతోడనే పరలోకమున కేగినది గాని దేహమును వీడి కాదు. దశరథుఁడు స్వర్గమున కేగి యుద్ధములో దేవతలకు సాయ మొనరించెను. అతఁడచటికిఁ బోయియున్న కారణమున నాతనిని మరణించినవానినిగాను, అతనిభార్యలు వైధవ్యము నందిన వారలఁగాను నెవ్వరైనఁ దలంచిరా! అతఁడే రాముఁ డరణ్యమునకుఁ జనినతర్వాత బెంగపెట్టుకొని తనువు విడిచి స్వర్గమునకుఁ బోయెను. అపుడాతఁడు మరణించినవాఁడుగా నెంచఁబడియె. అతనిభార్యలకు వైధవ్యము సంప్రాప్త మయ్యె. కావున నీలోకమున సంప్రాప్తమైన యీదేహముతోఁ బాతాళలోకమునకుఁ జని యున్నసీతను మృతులైన వారితో సమముగా నెంచఁదగినదికాదు. శ్రీమతి సరోజినీనాయఁడమ్మగారీకాలమునఁ బాతాళలోకమునకు (అమెరికాకు) వెళ్లుచు వచ్చుచుండునట్లే సీతాదేవికూడఁ బాతాళలోకమునకు వెళ్లుచు మరల భూలోకమునకు వచ్చుచుండెను. ఈలోకమునకు వచ్చి రాముని కామె యనేకోపచారములుచేసె. ఇట్టిసీతను మృతులలోఁ జేర్చుట యెంతమాత్రమును దగదు కావునఁ బాతాళమందున్న సీతయొక్క ప్రతికృతిని బెట్టుకొని రాముఁ డశ్వమేధము చేయుట న్యాయముగనే యున్నది. విదూరస్థయనగా గ్రతుకాలమున నునికి తెలియమిని లభించుస్థితిలో లేనిదనినమాటయేగదా. భార్యాప్రీతికై శ్రౌతయజ్ఞక్రియలు సాగుననుట తగదు.

అంతర్నాటికాంతమున సీత కాన్పింపఁగా సీత జీవించియున్న దను నింతరామునకుఁ గలిగినది గాని యాతనికి నామెజీవించి యున్న దను తలంపప్పుడు క్రొత్తగాఁ గలిగినదిగాని మొదటినుండియు లేదని కరుణావాదులు తెలిపిరి. అంతకుఁబూర్వమందు సీత జీవించియున్నదను ప్రత్యాశ రామునకుఁ గలుగనిచో సీత కాన్పించినప్పుడు లక్ష్మణునితోఁ గూడి యాతఁడు-దైవానుగ్రహమువలన మనమను కొనినట్లేమైనది- (దిష్ట్యా తథైవైతత్) అని యెట్లు పలుకఁగలిగెను. దీనింబట్టి యింతకుఁ బూర్వమునందే సీత జీవించియున్న దనియుఁ గుశలవులం గనిన దనియు వారు భావించుకొని యుండినట్లు స్పష్ట మగుచుండలేదా. రామునకు సీత జీవించియున్న దనుతలం పుండుఁగాక. ఆమెను విడిచివేసినవాఁడు మరలనెట్లుస్వీకరింపఁ గలఁడు. కావున నీవిధముగాఁ బ్రత్యాశ లేదని చెప్పవలసి వచ్చుచున్న దని కరుణావా

దులు వాదించుచున్నారు. కాని దీనికిఁ దగుసమాధానము నాటకమే యిచ్చు
చున్నది. విడిచిపెట్టిన సీతను మరల స్వీకరించుట యెట్లను ప్రశ్నప్రస్తావనయందే
గలదు. సీతారాములను గలుపుటయే నాటకప్రధానోద్దేశము. అది యెట్లు
కలుగు ననఁగా దేవతలయొక్కయు ఋషులయొక్కయు ననుగ్రహముచేఁ గలుగు నని
తెల్పఁబడినది. నాటకమందుఁగూడ నాపుత్రులను రాముఁ డాదరించునా యని
సీత ప్రశ్నింపఁగాఁ దమస, దేవతలును ఋషులు నందులకుఁ బ్రయత్నించుచున్నా
రనియు నందులకై వారొకసంఘముగా నేర్పడినా రనియుఁ బలికినది. ఆసంఘము
వసిష్ఠుఁడు, వాల్మీకి, అరుంధతి, భాగీరథి, పృథ్వి మున్నగువారితోఁ గూడుకొనియు
న్నదని నాటకమే తెల్పుచున్నది. వసిష్ఠుఁడు సీతారాముల కిప్పుడు వియోగము
గలిగినను మరల మంగళమే కల్గునని చెప్పుట ప్రత్యాశను గలిగించుచున్నది. ఇది
రామునికడఁ బలుకలేదే యందు రేని మాటలు కోటలు దాఁటును కాన, ఋష్య
శృంగాశ్రమములోఁ బలువుర యెదుటఁ బలికినపలుకులు రామునకుఁ దెలియవ
చ్చుట వింతకాదు. పైనిఁదెల్పఁబడిన పెద్దల మహాయత్నముచే వారుభయులుం
గలిసిరి. ప్రతికృతిని బెట్టుకొని రాముఁ డశ్వమేధముం జేయుట సీతారాములు కలి
యుదు రను ప్రత్యాశను దెలుపుచున్నదని యరుంధతి పలికినది.

“ఏకోరసఃకరుణఏవ” అని భవభూతియే పల్కినాఁడే. నీ విందలి రసము
శృంగార మని యెట్లు చెప్పఁగలవని యందు రేని “ఏకోరసః కరుణఏవ” అనువాక్య
ములు నాటకములో నొకపాత్రమగు తమసచేఁ బలుకఁబడినవి. నాటకమునందు
వచ్చు నొకపాత్రము నాటకప్రధానరసము కరుణ మని వెల్లడించిన దనుటకంటె
వింత మఱియొక టుండనేరదు. అది నాటకరసముంగూర్చి ముచ్చటించునదికాదు.
ముచ్చటించునదియె యందు రేని కరుణశబ్దమునకుఁ గరుణవిప్రలంభమను నర్థము
కూడఁగలదు. విప్రలంభములలోఁ గరుణనామక మొక్కటి గలదు. కరుణవాదు
లాయంశము నంగీకరించియేయున్నారు. కాఁబట్టి “ఏకోరసః కరుణఏవ” అనినప్పుడు
కరుణవిప్రలంభ మని యర్థముచెప్పుకొనవలెను. ఈవాక్యమే యనేకులను భ్రమ
పెట్టుచున్నది. ఇంతయేల, శాస్త్రములు, నాటకనామకరూపకమునందలి ప్రధాన
రసము శృంగారమో వీరమో మాత్రమే యై యుండవలయు నని తెల్పుచున్నవి.
భవభూతి శాస్త్రానుగుణముగాఁ బోవువాఁడని కరుణవాదులే చెప్పిరి. అట్టివాఁడు
శాస్త్రవిరుద్ధముగాఁ దననాటకమును గరుణరసప్రధాన మెట్లుచేయును. సాహిత్య
దర్పణ టీకాకారుఁడు శృంగారవీరములే నాటకములోఁ బ్రధానములై యుండ

నవసరములేదు. ఇతరరసములు నుండవచ్చునని వల్కినాఁడనియుఁ గావున నాటకము కరుణరసప్రధానముకావచ్చునని యుఁ గరుణవాదులు పలికిరి. ఈటీకాకారుని వాక్యములు మూలమునకుఁ జాల విరుద్ధముగా నున్నవి. శృంగారమో వీరమో మాత్రమే ప్రధానముగా నుండవలయునని మూలము చెప్పుచుండఁగాఁ దద్వ్యతిరేకముగా జ్ఞాపికాకారుఁడు పలికినపలుకు లెక్కుడు ప్రమాణములగునా! అదిగాక కరుణరసప్రధానమగు నాటకము మఱియొక్కటి కాన్పించినదా; కాన నిక్కట్టునఁ గరుణరసప్రధానుల వాద మంగీకరింపఁదగినది గాదు. శృంగారమో వీరమో నాటకములోఁ బ్రధానముగా నుండవచ్చు నని లక్షణము చెప్పుచున్నది కావున భవభూతి మహావీరచరిత్రమును, వీరరసప్రధానముగాను- ఉత్తరరామచరిత్రము (కరుణవిప్రలంభ) శృంగారప్రధానముగాను-గావించి రెండునాటకములు వ్రాసెను. ఇతఁడు రచించిన వానిలో మూఁడవది యగుమాలతీమాధవము నాటకనామకరూపకముకాదు. అది ప్రకరణము. ప్రకరణములో శృంగారమొక్కటియే ప్రధానరసముగా నుండవలయును,గావున, దానినిశృంగారరసప్రధానముగాఁ జేసినాఁడు. ఈప్రకారముగా శాస్త్రమునే యనుసరించినాఁడు. పూర్వవ్యాఖ్యాతలెల్లరునుత్తరరామచరిత్రము కరుణరసప్రధానమనిరని కరుణవాదులుచెప్పిరి. అదిసత్యముగాదు. వ్యాఖ్యాతలలోనెల్ల నారాయణభట్టు మిక్కిలిప్రాచీనుఁడని చరిత్రాభిజ్ఞులు వ్రాయుచున్నారు. ఈతఁడు వ్రాసిన భావార్థదీపిక యను వ్యాఖ్య నాటకము కరుణరసప్రధానమనుటలేదు. కరుణవిప్రలంభప్రధానమనుచున్నది. కావున నాదినుండియు భవభూతికృతనాటకము కరుణవిప్రలంభశృంగారప్రధాన మను వాడుకయున్న దనియు నదియే సత్యమనియు గ్రహించుకొనవలయును.

ఇత్యాదిగా శాస్త్రులుగా రుపన్యసించిరి. గ్రంథవిస్తరభీతిచే ననేకాంశములు ప్రకటింపలేకపోయితిమి. ఇఁకనొక విశేషము గలదు. శాస్త్రులుగారు తాము నాఁ డుపన్యసింతుమని మాకు బాసయిచ్చినతర్వాత వారికి ముఖపక్షవాతము వచ్చినది. మూతి వంకరపోయినది. మాటలు కొంచెము ముద్దగా వచ్చినవి. అయినను వారు వాగ్దానముచేసిన రీతిగా నియతదినమున యథాకాలమునకు సభకు విచ్చేసి రెండుగంటలవఱకు మృదుమధురగ్రాంథికశైలి నుపన్యసించిరి. ఇది శ్రీశాస్త్రులవారు దేహసంరక్షణముకంటె దేశసంరక్షణమే ముఖ్యముగా నెంచుకొనువారను నంశమును వెల్లడిచేయుచున్నది.

క. అదికారణముగ నతనికి, సదృశం బగుగుణము నీకుఁ జాలదు భువిలోఁ
బాదలనిపెద్దఱికంబులు, పొదపెట్టక[1] మగిడి పొమ్ము భోజనృపాలా. ౫౫

వ. అనుడు ననంతరంబ. ౫౬

శా. లగ్నం బీక్రియ విఘ్న మొందిన నిరాలాపంబుగా విస్మయో
ద్విగ్నస్వాంతనృపాలపౌరహితవందివ్రాత మీక్షింపఁగా
భగ్నోత్సాహమనోరథుం డగుచు భూపాలుండు లజ్జాభరా
భుగ్నాస్యాంబుజుఁ డౌచు నింటి కరిగెం బుణ్యం బగణ్యంబుగన్. ౫౭

వ. అంతఁ గొంతకాలంబున. ౫౮

— రెండవబొమ్మకథ —

క. మొలఁ బులితోలును మేనం, బలుచని వెలిపూఁత యఱుతఁ బాములపేరుం
దల మిన్నేఱును జడలను, జలివెలుఁగుం గలుగు మేటిజంగముఁ గొలుతున్.

సీ. అనుచుఁ గడంకతో నాభోజతిలకుండు దివ్యాసనంబెక్కఁ దివిరి మఱియు
ఫలకుసుమాదిశుభద్రవ్యములు గూర్చి సర్వపూజలుఁ దొంటిజాడఁ జేసి
కవిరాజభూసుర గాయకపాఠక నర్తకులును దనకీర్తి పొగడఁ
బసిఁడిగిన్నియలు చేపట్టి పుణ్యస్త్రీలు శిరమున మౌక్తికశేష లిడఁగ
ఖడ్గహస్తుఁ డగుచుఁ గదలి నృపాసనప్రాంతభూమి చేరె గ్రహబలంబు
గలుగువేళఁ బూర్ణఘటికాంతనాదంబు, చెవుల సోఁకినంత శీఘ్రగతిని. ౬౦

క. శింజాయితమంజీర, వ్యంజితనీలాంశుభృంగ మగు పదకంజం
బంజక యిడఁగా వేళా,భంజని[2]యై యచట సాలభంజిక పలికెన్. ౬౧

క. ఓహో భూవర వలవని, హాహూలివి[3] యేల విక్రమార్కు నిసరిగా
సాహసమును గంభీరో,త్సాహంబును లేక యెక్కఁ దరమే నీకున్. ౬౨

గీ. అనుడు నిలిచి భోజుఁ డాత్మగుణంబులు, చెప్పఁ జూచి మొదలితప్పఁ దలఁచి
మాని నాఁటిబొమ్మపూనిక నీవును, దప్పకుండఁ జెప్పు తద్గుణములు. ౬౩

క. అనవుడు నది యిట్లను నీ,గొనములు గలనృపులఁ బేరుకొని చెప్పం జూ
చిన జగమున నుజ్జయినీ, మనుజేంద్రుఁడుగాక యితరమనుజుఁడు గలఁడే.

క. శుభలక్షణుఁడు వదాన్యుం, డభయము డీకఁ గలుగ నేర్పునయ్య "నభూతో
నభవిష్యతి" యనుపలు కా,ప్రభునకు నటచెప్పుచోటఁ బలుకఁగవచ్చున్.

శా. ధారానాథ యనాథసస్యములకున్ ధారాజధారాధరా
కారుం డై కరుణామృతంబు గురియుంగాఁ బ్రాజ్యసామ్రాజ్యల

1. పొదపెట్టక-శర. 2. భంజిక-చిన్నయసూరి. 3. వలదుసుమాహూలివి. యాహూలివి-చిన్నయసూరి.

త్క్రియాఢిం జగ మెల్ల నుల్లసిలఁగా శ్రీవిక్రమార్కాఖ్యుఁ డు
ర్వీరామారమణుండు కీర్తిఁ బరఁగెన్ వీరుం డుదారుం డనన్. ౬౬

మత్తకోకిల. అమ్మహీశుఁడు నాఁడునాఁటికి నాత్మభూముల నన్యదే
శమ్ములందుల వార్తలం బరిచారకు ల్వినిపింపఁగా
నిమ్ముతోడ నవంతిపట్టణ మేలుచుండఁగ దూరదే
శమ్మువార్త లెఱుంగఁబోయినచారు లిద్దఱు వచ్చినన్. ౬౭

ఉ. అచ్చటివార్త లెల్లఁ దెలియ న్విని వారల నాదరించి వి
రిచ్చటి కేగుదెంచునెడ నీసకుమర్ గిరులందుఁ గానలం
దచ్చెరు వేమి గంటి రని యానతి యిచ్చిన నందులోన న
య్యిచ్చ యెఱింగి యొక్కఁడు నరేంద్రున కి ట్లనియె న్వినీతుఁడై. ౬౮

సీ. చిత్రకూటాద్రిపైఁ జిత్రంబు గనుఁగొంటి నచటి బిల్వద్రుమప్రచుర మైన
పుణ్యతపోవనంబున రత్నకాంచనమయ మైన దేవతాలయము గలదు
లోకైకవంద్య మందాకినీజలధార తీరమై ముందటఁ దొరఁగుచుండు
నానీరు శుద్ధమై యమృతంబునవఁ బోలుఁ బాపిపైఁ గాటుకభంగిఁ దోఁచు[1]
దానిపొంత నొకఁడు మౌనియై జపముతోఁ, బాయకుండ వేల్మిసేయుచుండు
నతని కెన్నియేఁడు లరిగెనో యెులికిన, హేమమధూళి హిమనగోన్నతంబు.

మ. అనిచోద్యంబుగఁ జెప్పిన న్విని తదీయాలోకనోత్సాహియై
మనుజేంద్రుండును దిగ్గనం గదలి రమ్యా చూత మాహాని పా[2]
వనతీర్థం బని వానిఁ దోడుకొని భాస్వత్ఖడ్గసాహాయ్యుఁడై
చనియెం గ్రూరమృగప్రచారతరువిస్తారంబులం దూఱుచున్. ౭౦

వ. ఇట్టి దుర్గమమార్గంబునం జనుదెంచుచు నొక్కయెడ. ౭౧

ఉ. భూరమణుండు గాంచె నతిభూరిపయోధరఘాట మాత్మవి
స్తారపునఃప్రరూఢపటుశాఖమహావటజాట మంచితో
ర్వీరుహసంభృతైకమునివీరకృతోటజవాటము న్ననా
సీరమణిప్రభాపటలచిత్రితకూటముఁ[3] జిత్రకూటమున్. ౭౨

సీ. అందులతీఁగె లింద్రాంగణాగములతోఁ జెలిమిసేయుచు మిన్ను గలయఁబ్రాఁకు
నందుల ప్రూఁకులు నందనవనకల్పతరువులతోఁ గూడి పెరుఁగుచుండు

1. శుద్ధమ కమృతమై పాలుపాఱఁ బాపిఁగాటుకభంగిఁదోఁచు-అనీరు పుణ్యుల కమృతంబువలెనుం డు-చిన్నయసూరి. 2. చూత మాదివ్యపావన 3. చిత్రవనాటము.

నంచుల క్రొవ్విరు లన్నదమ్ములమాడ్కిఁ జుక్కలవాసన కిక్కసేయు
నంచుల సెలయేఱు లాకాశగంగతో నటనలు సలుపుచు నాడుచుండు
నంచుల మెలఁగు కరు లైరావతముఁ దామకుఁ, గదుపుగట్టి మేసి మదము గురియు
నంచుఁ గలుగు మాను లాసప్తమునులతో, నిత్యసత్యగోష్ఠి నిలుపు రచట.

ఉ. అంచుల నొక్కచో జలకమాడుచునుండఁగఁ దొల్లి మేదినీ
నందనవక్త్రవేణినయనస్తనకాంతులు జాతిరూపులై
యిం దుదయించె నాఁగ నతిశక్కుచుఁ బెక్కుదినంబు లంబుజేం[1]
దిందిరమీనచక్రములు దేలుచునుండు సరోవరంబులన్. ౨౪

క. వివిధద్వాదశరాసులు, దవిలి తిరిగి పాళ్లసంపదలు చేకుఱిమి
న్నవరత్నరాసులకునై, నవగ్రహంబులుం దదంగణంబులఁ బొలయున్. ౨౫

క. వింతలుగా నగ్గిరిపొడ, వింతం తని చెప్ప నలవి యే వెన్నెలఁ ద
త్ప్రాంతంబునఁ గరఁగినశశి,కాంతంబులు చంద్రుకంను గడుగుచునుండున్.

సీ. శిరమున విమలపుష్కరవతి యగుమాల్యవతి రత్నమాలికావతి యనంగ
మృగపాదఘట్టన మృదులమాజేగుఱుధూళి శేఖరితసిందూర మనఁగఁ
బ్రబలసమీరణోత్పతితంబు లైన పుష్పంబులు కరశీకరంబు లనఁగ
సర్వతోముఖసముచ్చాలనవారి[2]నిర్ఝరములు మదజలస్రావ మనఁగఁ
దన్నుఁ జేరినమేఘముల్ మన్ననంగ[3], సాలతరువులు బర్హధ్వజము లనంగ
నేచినీరాజ్యపట్టగజేంద్రులీల[4], నిలిచిపొలుచునయ్యచలంబునృపతియెక్కె.[5]

శా. లంకేశారిపదాంకితంబులు ఝరాలంకారకూలంకషల్
పంకేజాకరసంకులాంతరములం బ్రవ్యక్త దివ్యాంగనా
సంకేతంబులు మీనకేతనధనుష్టంకారశంకావహా
ఝుంకారాళికులంబులుం గల మహాశైలస్థలుల్ చూచుచున్. ౨౮

క. ధారాధరమార్గాగత,ధారాళం బగుచు ధరణిధరమధ్యకృతా
ధారం బై ధరఁ బరఁగిన, ధారాతీర్థంబు గనియె ధారాధీశా. ౨౯

వ. కనిన నితని మనఃప్రసాదంబు దట్టం బై నిలిచె. ౩౦

క. దుర్మార్గునకైన మహా,ధర్మస్థలి నాత్మశుద్ధి దలకొను ననఁగా
ధర్మంబుల కాకరమా, నిర్మలునకుఁ జిత్తశుద్ధి నిలుచుట యరుదే. ౩౧

---

1. నతిశక్కు..దినంబులయందు నంబుజేం 2. చ్చాలనలోలి 3. పన్నసంగ. 4. ఉజ్జయినిరాజు పట్టగజేంద్రలీల—ఈపాఠము యతిచెడినది. 5. ఇక్కడ వ. "అచటఁ దెరువుఁజూపుచు మావంతు క్రియాహారుంను చూపమున్న గానతండు చని చని" అని యొకసానిలోఁగలదు.

భుజంగప్రయాతము. అతం డంత సుస్నాతుఁ డై రత్నహేమాం
చితం బై సువర్ణాద్రి చెల్వొంది దేవా
న్వితం బైన హర్మ్యంబు వే సొచ్చి యాదే
వతం గాంచి పూజించి వచ్చె న్నతుం డై. ౮౩

గీ. అచటిహోమశాల కరిగి వహ్నిసంబునఁ, దపము కలిమిదోఁప జపముతోడ[1]
మధురయుతములైన మారేడుఁబండ్ల, వేల్మి సేయుచున్న విప్రుఁ జూచి.

గీ. అన్నపుష్పఫలజలాక్షతాదులు చేత, నున్నవాఁడును[2] జపహోమములను
జేయువాఁడుఁ బ్రణతిసేయఁదగదుగాన,[3] మనుజవిభుఁడు మ్రొక్కమానిపలికె.

క. ఓవిప్రోత్తమ సవనం,[4]బీవెరవున జరుగ నెన్ని యేఁడులు చనియె
న్నావుడు నుబ్బస పుచ్చుచు, నావిధిచేఁతలకు నేమి యనఁగల దధిపా. ౮౬

ఉ. ఇచ్చట నేండ్లు నూఱు సనియెన్ జగదంబిక నాయవస్థకు
న్మెచ్చదు కూడు మాని రవి మీఁదఁ దపింపఁగ వేల్మి సేసి ము
చ్చిచ్చున వెచ్చుచుండి తెగఁ జిక్కితి నన్నఁ; గృపానువృత్తిఁ దా
నచ్చటివాని లేపి విహితాసనుఁ డై నృపుఁ డాత్మనిష్ఠతోన్. ౮౭

క. వ్యాలోలకరాళకజి,హ్వాలం బగు సప్తజిహ్వవదనంబున భూ
పాలుఁడు మధుమిశ్రిత మగు, మాలూరఫలంబు వేల్చె మంత్రముకొలఁదిన్.

వ. అట్లు హోమంబు గావించిన నయ్యుమ నెమ్మనంబున నమ్మిక పొడమి పొడ
సూపకున్నం గడచూపునం గెంపుగదుర మదిం బదరి దొరకొన్నకర్జం బుజ్జ
గించుట యిజ్జగంబున నోజ్జల లజ్జ లుడుపు రజ్జులనుచు నుజ్జయినిఱేఁడు మారే
డుఁబండు మాని తన మెడం జూచి. ౮౮

గీ. పలుకుఁదేనియ గలతలపండు వేల్వఁ, దలఁచి తలచిక్కు చక్కమీఁదటికిఁ[5] జెరివి
యెడమకేలఁ దెమల్చుచు నడిద మెత్తి, మెఱుఁగుమిడుఁగుఱు లెగయఁగా మెడకుఁ బూనె.

వ. ఇట్లు పూని యుంకించిన. ౯౦

క. ఓహో నృప నీధర్మో,త్సాహములకు మెచ్చితిని నిజం బిది యిఁక నీ
సాహసము విడువు మని త,ద్బాహాఖడ్గంబు పట్టెఁ బరమేశ్వరియున్. ౯౧

క. పట్టి నిలుచుండి నృప నీ, కిట్టిహితం బైన వేఁడు మిచ్చెద నని చే
పట్టిన మ్రొక్కి మహీవరుఁ, డి ట్టనియెం దల్లి మెచ్చి తెట్టులు నన్నున్. ౯౨

---

1. భువనేశపోవిభూతికలిమి మెఱసి 2. నున్నతనికిని 3. జేయునతనికి నతి చేయఁదగదుగాన
4. హవనంబీవెరవున......నావుడునుబుస్సగొట్టుచు-చిన్నయసూరి, 5. చెక్కు-మీఁదటికి,

మ. ఇతఁడు స్నానము సంధ్యయున్ జపము ని త్యైకాలముం జేయఁగా
శతవర్షంబులు పోయె నీద్విజుని మెచ్చం జెల్లదో మెచ్చుసం
గతి గాదో గుణ మానతి స్మనిన నోక్ష్మాపాల యీదుస్తర
వ్రతము ల్లల్లియుఁ జంచలంబు మతి భావం బల్ప మెప్పట్టునన్. ౯౩

గీ. మేరుశైలధీర మేరులంఘితమున, నాఁగు నీవ్రతంబు నగణితంబు[1]
చంచలాత్మకృతము సంకల్పరహితంబు, నైన జపము లెల్ల హానిఁ బొందు. ౯౪

క. దేవర భువిఁ గాష్ఠంబున, గ్రావంబునఁ గాంచనమునఁ గలుగఁడు శుచియౌ
భావమునఁ గలుగ నేర్చును, భావజ్ఞా భావశుద్ధి పరమార్థ మనన్.[2] ౯౫

క. డెందంబున సందేహము, నొందక ప్రహ్లాదుతండ్రి నోడఁబఱిచెడుచో
నిందుఁ గలఁ డనినఁ గంబము,నం దుదయింపఁడె విష్ణుఁ డసురులు బెదరన్.

క. దేవద్విజమంత్రౌషధ, దైవజ్ఞాచార్యతీర్థగ్రముల యెడన్
భావన యేవిధమున నౌ, నా వెరవున నచటి సిద్ధి యగు నిద్దగతిన్.[3] ౯౭

గీ. భావ మస్థిరంబు గావున వీనివ్ర, తంబులెల్ల నిష్ఫలంబు లయ్యె
నీవు నిష్ఠ నిట్లు గావించితివి గాన, గడియలోన మెచ్చు గలిగె నీకు. ౯౮

క. ధన్యుఁడ వనవుడు విని స, త్కన్యాదానమును దేవతావరమును రా
జన్యవరాజ్ఞయుఁ దిరుగుట, యన్యాయము గానఁ దిరుగ కంబిక వినుమా. ౯౯

ఉ. ఇష్టములెల్ల నాకుఁ దగ నిచ్చెద నంటివి సర్వమున్ వ్రత
భ్రష్టుఁడు నాక వీనికిఁ గృపామతి నిమ్మని మ్రొక్కినంత సం
తుష్టి వహించి దేవత చతుశ్శతవత్సరభోగ్యమైన యు
త్కృష్టమహీపతిత్వమును దివ్యపదంబును నిచ్చె వానికిన్. ౧౦౦

క. వానికి ని ట్లిచ్చి ధరి,త్రీనాథునకుఁ బ్రణమించి దేవియు నంత
ర్ధానమ్మునొందె విప్రుఁడు, నానృపు వెఱఁగంది పొగడి యరిగె నిజేచ్ఛన్.

శా. తత్సేవాఫలదర్శనంబున మహత్త్వస్థాన విశ్రాంతిగా[4]
నుత్సాహంబును సాహసంబును బ్రతాపోదారభావంబు స[5]
త్యోత్సేకంబును భూషణాకృతులతో[6] నొప్పారఁగా భూపతీ
వాత్సల్యంబున వచ్చె విక్రమయశోవర్ధిష్ణుఁ డుజ్జేనికిన్. ౧౦౨

వ. కావున నీ కిట్టి గుణంబులు సమకూరకునికి నెక్కంజనదు పొమ్మనిన విని భోజుం

---

1. మేరుసమానమౌ, ఘనతపంబులౌనగణితమైన, 2. పరతత్త్వ మనన్. 3. నీదుక్రియన్.
4. దదద్వ్యశ్రాంతిగాఁ జిత్తమునుత్సా. ౬. గర్వోత్సేకంబున

డును మనంబున నతనిం గొనియాడుచు నుద్విగ్నితలగ్నుండై[1] సిగ్గుపడుచుఁ బూర్వద్వారగమనంబు మాని యపరద్వారగమనోత్సుకుం డగుచు నాఁటి కద్దివ్యాసనం బెక్కరాకుండుట తెల్లంబుగా మొగంబు తెల్లంబడఁ దిరిగి చని మఱి యెక్కనాఁడు. ౧౦౩

మూఁడవబొమ్మకథ

క. ఉల్లోలదుగ్ధసాగర, కల్లోలకరాగ్రమందకంపితఫణభృ
ద్వల్లభమణిమయడోలా, వేల్లనసుఖలోలుఁ డైన వేల్పుం దలఁతున్. ౧౦౪

క. అని నియమంబున హితశా,కునికస్వరశాస్త్రవేదకోవిదయుతుఁ డై
యను వగుదినమున సింహా, సన మెక్కఁదలంచి భోజజనపతి చేరెన్. ౧౦౫

క. చేరిన నచ్చటిపుత్రిక, యారాజుం బలికె వాసవాసన మెక్కం
గోరుట జగ మెఱుఁగ మహా,దారిద్ర్యుఁడు క్రతువుసేయఁ దలఁచుటచుమ్మీ.

ఉ. ఆర్యులఁ గూర్చి నేఁడు శుభమైన ముహూర్తము చూచి పట్టిగాం
భీర్యము దోఁపఁగాఁ దగని పెద్దఱికం బిది యేల సన్నపుం
గార్యమె విక్రమార్కనృపుగద్దియ యెక్కుట వానిఁబోల నౌ
దార్యము నీకుఁ గల్గినఁ బదం బిడు మోజగ భోజభూవరా. ౧౦౭

వ. అనుడు విస్మయమానమానసుం డై మానవేంద్రుం డాసింహాసనయానంబు మాని యనుమానించి యీనరపతివితరణంబు లే తెఱం గెఱింగింపు మనిన నది యిట్లనియె. ౧౦౮

సీ. బలమున నిజమునఁ బ్రాణరక్షణమున భీము భీమాగ్రజు భీమగురునిఁ
జెలువున సంకల్పసిద్ధిఁ దేజంబునఁ బద్మారిఁ బద్మజుఁ బద్మమిత్రు
శివభక్తిఁ గీర్తి విశిష్టదానంబున బాణు బాణారాతి బాణజనకు
నైశ్వర్యమున రతి నఖిలోత్సవస్ఫూర్తిఁ[2] గామసంహరుఁ గాముఁ గామసఖుని
నష్టభోగముల రణాటోపమున బుద్ధి, నింద్రు నింద్రతనయు నింద్రమంత్రిఁ
గ్రేణి సేయు ననుచు జాణలు వొగడంగ,నవని యేలె విక్రమార్కవిభుఁడు. ౧౦౯

క. సాహసము జయము బల ము,త్సాహంబుఁ బరాక్రమంబు ధైర్యముఁ గలని
ర్వ్యాహకుని దొరయునెడ సం,దేహించుచునుండు నాదిదేవుం డైనన్. ౧౧౦

క. నరుఁడు మగతనము నేర్పునఁ, బరఁగించెకుచోటఁ దోఁపుపడుదురు సురలున్
ధర గాళికునకుఁ దోడ్పడ, గరుడఁడు జక్రంబు హరియుఁ గలిగినభంగిన్. ౧౧౧

---

1. విఘ్నితాలంఘితకాలజ్ఞుండై 2. నఖిలలోకస్ఫూర్తి.

క. అనవుడు భోజుఁడు గాళికుఁ, డనువానికి నెచట కృష్ణుఁ డాయుధమును వా
హనమును దోడ్పడియెను నే,వినవలతుం జెప్పు మనిన నెన నిట్లనియెన్. ౧౧౨
గీ. తుంగసౌధశృంగసంగతాంబర మగుచుఁ, బూర్వభూమి నొక్కపురవరంబు
భజన కెక్కియున్న నిజమైనపేరిట, వెలసెఁ భువిఁ బ్రతాపవిజయ మనఁగ. ౧౧౩
వ. అట్టిపురంబున. ౧౧౪
క. సేనానికి నెన యనఁ బర,సేనాధంజకుఁడు గలిగె క్షితిపతి విష్వ
క్సేనారాధకుఁడు బృహ,త్సేనాఖ్యుఁడు బల్మి భీమసేనుఁడు వోలెన్. ౧౧౫
వ. ఆనరేంద్రునకు నానందిని యనుసుందరియును నయనానందంబుగా నొక్కనం
దన యుదయించె. ౧౧౬
క. ఆరాజతనూభవ క,న్యారత్నము మరుని మోహనాస్త్రముక్రియ నా
కారంబున నొప్పుచు ధర,లో రూఢికినెక్కె నది సులోచన యనఁగన్. ౧౧౭
క. భూవలయంబున నుపమా,జీవన మగు వస్తు వేర్చి చెప్పెద మనఁగా
నా వెలఁది యవయవములకు, నేవియు సరిగాక యునికి నేమనవచ్చున్. ౧౧౮
సీ. మృదుపల్లవంబులు ముసురకయుండినఁ బదసరోజములసంపదలఁ బోలుఁ
గరికరంబులమేనఁ గర్కశభావంబు లేకయుండిన నూరులీలఁ బోలుఁ
జక్రవాకంబులు సడిసన్నరేయెల్లఁ బాయకుండినఁ జనుదోయిఁ బోలుఁ
జుక్కలఱేఁడు దా గ్రుక్కక పొంగక కందకుండిన ముఖకళలఁ బోలుఁ
జంచరీకచయము సంచలింపక కూడి, నిలిచెనేని కురుల చెలువుదాల్చుఁ
బువ్వుఁదీఁగె మొదలిమవ్వంబు దప్పక,నిలిచెనేని మేనియనువుఁబడయు. ౧౧౯
మ. తనలావణ్య మగణ్యదర్పమయమై తారుణ్యపూర్ణంబుగా
ననవద్యద్యుతితోడ నానృపతికన్యారత్న మేరాజనం
దనుల న్మెచ్చక మీఁది మేడకడ గంధర్వాంగనావిభ్రమం
బున నుండెన్ మృదువస్త్రగంధసుమనోభూషాదిభోగంబులన్. ౧౨౦
సీ. తరుణి యీక్రియ మేడఁ దరలకుండుటయును దెలిసి గాళికుఁ డనుధీరవిటుఁడు
చాయలయుక్కునఁ జక్రంబు గావించి కాష్ఠయంత్రంబున గరుడిఁ జేసి
తా విష్ణుఁడై మన్మథప్రధనమునకు మెఱపుగాఁ గస్తూరి మిగుల నలఁది
పసపువన్నియ పట్టువసనంబు గావించి తిరునామ మొప్పఁగాఁ దీర్చి కడఁక
నెక్కి కీలున వాహన మెగయఁజేసి, పవనపథమునఁ జనుదెంచి బాలమ్రోల
నిలిచి నేనిదె కృష్ణుఁడ నిన్నుఁ గూర్చి, వచ్చితిని నన్ను వరియింపు లచ్చికరణి.

చ. అనవుఁడు బాల విస్మయము హర్షము లజ్జయు నగ్గలింప నా
తని నట నుంచి యేగి తనతండ్రికి నట్టితెఱం గెఱుంగఁ జె
ప్పిన నతఁడు న్నయంబున నభీష్టము నేఁ డొనఁగూడఁబోలు నీ
కని చనుదెంచి యచ్చట గవాక్షముఖంబునఁ జూచి యుబ్బుచున్. ౧౨౨

క. చల్లనికొండకు గిరిజా,వల్లభుఁ డల్లుఁ డగునట్టిసవునఁ దల్లీ
నల్లనిదేవర నీచే, నల్లుఁ డనఁగఁ గలిగె నేఁ గృతార్థుఁడనైతిన్. ౧౨౩

క. అమ్మా తడయక కైకొను, పొమ్మా యని యనుప నేగి పొలఁతుక యచటన్
నెమ్మి దఖుకొత్తఁగాఁ దన, నెమ్మన మలరంగ నాతని న్వరియించెన్. ౧౨౪

ఉ. గొళ్ళిఁ దమ్మెడ స్మదివికాసము హాసముఁ గూడియాడఁగా
బాలిక నంతనంత మృదుభాషణభూషణ తోషణంబులం
గేలికిఁ జేర్చి లజ్జ కడకీ లెడలించుచు బుజ్జగించి పాం
చాలుని పోలిక న్సురతసౌఖ్యము తీపులు చూపె నేర్పునన్. ౧౨౫

ఉ. అజ్జలజాక్షియున్ హృదయమందునఁబుట్టినవానిపోరుచే
బుజ్జవ మియ్యకోలు గొనుపొందునఁ గూడిన నింపుగైకొనున్
సజ్జకుఁ దాన చేరు రతిచేష్ట లెఱుంగఁగడంగు చెయ్యువలన్
లజ్జయొకింత చేర్పడఁ జెలంగుఁ జెనంగు ననంగకేలినై. ౧౨౬

క. ఇటు నానాఁటికి నొయ్యనఁ, గుటిలాలక యులుకు దీర్చుకొనుచుం దనకాఁ
గిట నాదటఁ జెలఁగఁగ న, వ్విటుఁడు న్ననురతుల గారవించుచుఁ దివుటన్.

సీ. అంగుష్ఠ మడుగు గుల్ఫాంతంబుఁ జిఱుదొడ జఘనంబు నాభి వక్షంబుఁ గుచము
భుజమూలములుగళంబును జెక్కు మోవియునయనములున్నుదురుముందలయుననఁగఁ
గలుగుచోటులఁ జంద్రకళలఁ బెంపునఁ జెక్కు నారోహణావరోహణము లెఱిఁగి
బీజమంత్రాక్షతవ్యాజహృద్భాషల[1]హృదయాదిమర్మంబు లెక్కఁజేయు
సుఖముఖాంకనఖరచుంబనభూషణ,గ్రహణతాడనములఁ గదలఁబొడిచి
చిత్తశయనుదెలిపి యుత్తానశాయిత,ముఖ్యసురతతంత్రములఁ గలంచె. ౧౨౭

క. మనసిజమర్జ్ఞునితో, మనమలరఁగఁ బెనఁగి కరఁగె మానిని రతిసం
జనితసుఖంబున నెలపొడు,పునఁ గరఁగెడు చంద్రకాంతపుత్రికఁ బోలెన్.

శా. ఆజాడం గుచచక్రవాకరుచి పెంపారం దదీయాననాం
భోజాతప్రభ లుల్లసిల్లఁగ సముత్ఫుల్లాక్షి[2]మీనద్యుతుల్

1. దృగ్బాణముల్ హృదయాదిమర్మవాహికలఁజొనిపి 2. పెంపారంగ శుంభన్ముఖాం భోజంబు లివికసింపుచుం జెలఁగ నుత్ఫుల్లాక్షి.

తగు నిప్పుడు కుజంబు నెగడదు మదకరి బెగడగు చెలి సాధుఁ బొగడ దనఁగఁ
గనఁగ విందురు కందు రనుటకుం ద్రుప్పు వచ్చి వింద్రు కంద్రన నిట్లు వెలయునింక
లఘ్వాదు లైన చలస్మరవరచరప్రముఖములౌ క్రియాపదములందె
యిత్వ మేర్పడక నొక్కెడల నడంగు నట్టులుగాఁగ నిలిచిన నిలుచు వినుఁడు
చలియించెను జలించె స్మరియించెను స్మరించె వరియించెను వరించె వహిఁ జరించెఁ
జరియించెను ధరించె ధరియించె నన నొప్పు నిటువలె మఱికొన్ని యెఱుఁగఁదగును
గణియించెను గణించె ఘటియించెను ఘటించె హరియించెను హరించె ననఁగ నింకఁ
జూచెనే ననుటకుఁ జూచుడు నాఁగను వచ్చెనే ననుటకు వచ్చుడు నన
మెచ్చెనే ననుటకు మెచ్చుడు ననిన లిజర్థక్రియ లగుచు నలరు నవలఁ
బ్రక్కింటి కొక్కక్రియ వెట్టెడిచో నాది నిలుపక కడపటను నిలుపఁదగు
నటులుగాక నడుమ నమరింపఁ దగదంద్రు దొరకెను గజఘటల్ దొరకె హరులు
కరిఘట ల్తురగము ల్దొరకె ననుట యొప్పఁ గరిఘట లబ్బెను తురగము లన
రా దింకఁ దుదియకారమున కెత్వము లేదు క్రియలపట్టుల నెత్వమయి తనర్చు
నెద్దు పర్వెత్తిపోయెను నాఁగ బంటు పనివినియె నా నిట్లు నెగడు మఱియు
నూయెల పయ్యెద తాయెతులనడిమి యెత్వమునకు యత్వ మేత్వమునకుఁ
జాయకుఁ బాయకు లోయకు ననుపల్కులం దెత్వ మమరక యత్వ మగును
సరవి సముచ్చయశబ్దాంతములఁ గ్రియ నమరింప బహువచనముగఁ దనరు
నేకవచనముగా నెసఁగదు వినుఁ డింక శ్రీశుండు హరియు వచ్చి రన మఱియుఁ
గమలజుం డింద్రుండుఁ గార్తికేయుఁడు వచ్చి రనఁగఁ జెల్లును వచ్చె ననఁ దగ దిఁక
వేపోఁక లనుటకు వేయిపోఁకనఁ జెల్లు జాత్యేకరచనాఖ్యసరణి నిట్లు
చిగురాకు గలయ మొల్చె నటంచు నాముక్తమాల్యదఁ బెద్దనామాత్యుఁ డనియె
నవల నాచారార్థమందలి క్విప్ప్రత్యయాంతంబులకును బర్యాయపదము
నెఱిఁగింతుఁ దెలియుఁడీ యిలకుఁ గోకగుచున్న సంద్రంబనఁగ నిల్లెసంగుచుండు
నింక స్వార్థములందు హేత్వర్థములయందుఁ గలుగుణిచ్చులయర్థములు వచింతు
నవి యెట్లన వినుండు వివరంబు మీఱ నింపుదు రింతు రనఁగ నొప్పును బహుతను
భువి భర్తులు గణియింపుదురు కీర్తింతురు హరిగుణము లనంగ స్వార్థణిచ్చు
కన దీని కేకవచనమున కింపు నించును వచ్చు దెఱిఁగింతుఁ గనుఁడు తెలియ
ఘనుఁ డెఱిఁగింపునా జనుఁ డెఱిఁగించునా లక్ష్యము లిట్లు చెలంగు నవల
నూహింపఁ బనిచేయుచుండెను నరుని జేయింపుచున్నాఁ డని యిటులు చెప్ప

మాటయె యలహేతుమణ్ణిజర్థంబునఁ బరఁగుచునుండు నిప్పగిది మఱియుఁ
దద్ధాతుమణ్ణిజర్థంబునఁ దముగల్గి యిప్పింత మనఁగ నిల్లెసఁగుచుండు
నొగి స్వార్థణిచ్చునన్దము గల్గి కాలత్రయమున నిత్తు మనంగ నమరుచుండు
నవల యజంతార్థ మతిశయమున నేని మాటిమాటికి నేని తేటగాఁగ
సూచించు నతఁడన పొరిడి మీాఱఁగ నిట్లు లక్ష్యంబు లెన్న చెలంగు నింక
దొరఁకొన నామధాతుప్రక్రియార్థము తనయందు కావలె ననుచు నిచ్ఛ
గుంచుట యన్నట్లు లింక క్యజర్థము కృష్ణునివలె నాచరించుచున్న
వాఁడన నిట్లింక వహిఁగ నాఖ్యానార్థ మిలను సత్యమ్మునఁ బలుకు ననుమొ
దలయినను షుప్రులై తగునింక భావకర్త్రార్థము దెలిపెద నగుట యనఁగఁ
బ్రభువుచేత నొసంగఁబడుట యనఁగ నిట్టి నుడులు లక్ష్యమ్ములై యడరు నవలఁ
బ్రార్థనం బగుచోటఁ బ్రశ్నంబువిశే సంశయంబుదిక్కున నిర్ణయంబుపట్ల
నెత్వము నొత్వము నౌత్వము వరుసగా నలరు దీనికి లక్ష్యములు వినుండు
వనితరావే యన వాసలు గలవేమొ నాఁగ నీహో యతండో గణింపఁ
జెలియ నీవేచుమీా చేరసా నన నింక నందింపు నెందను నట్టి నుడులు
నటు నిటు నెటు లన నమరు నా నటుఁజూతు నిటుఁబిల్తు నెటుఁబోయెఁబటమనఁదగు
నటవలెఁ గాదని యిటనాడెడినెలంత యటఁబాడెడి ననంగ నమర నింకఁ
గ్రియలు విభక్తు లవ్యయములు సంస్కృతపదము లైన నొకచోఁ బరిఢవిల్లుఁ
దెనుఁగున "మాధవం మనసా భజంతి సంతత" మనినట్టుల "దరరథాంగ
పాణియుగ్మాయ తుభ్యం నమో" యన నిట్లు "దహానబింబాధరస్తనభరేషు"
నా వహిఁ మఱియు "సదావాగ్విబుధ" మనిన ట్లనువాదాన నటులు గాక
భవతి దదాతి బిభర్తి భాతి చరంతి గిరతి శేతే యను క్రియలు చొరవు
రామః పయోధరం గ్రామేణ సర్వస్య యనెడువిభక్తులు నునుపఁ గావు
కృత్వా హసిత్వా పరిత్యజ్య నాఁగ క్త్వాంతల్యబంతావ్యయాల్ తగవు కృతుల
సేసి గరీయాన్ వరీయా ననెడి యీయసున్ ప్రత్యయాంతము ల్చొరవు తుదల
నెన్నంగ దత్తవాన్ కృతవా ననెడి క్తవతుప్రత్యయాంతాల్ కృతులను జొరవు
పేచివా నేయివా సూచివా ననుక్వసుప్రత్యయాంతంబు లేపట్లఁ జొరవు
రంతు మకర్తు మస్రంకార మను తుమున్ ణములంతములగు శబ్దములు గూడ
వపిచ నహీవతు లనునవ్యయపదము లొనర విటులఁ దెనుంగునకు మఱియుఁ
జేయఁదగినదినా నీయఁదగినదినా నమరు తవ్యప్రత్యయార్థము లయి

యవల శతృప్రత్యయార్థముగలపేళ్లు వర్తమానార్థాన వఱలు వినుఁడి
మెలనాఁగ వీణవాయించుచుఘనులఁ బిల్చుచుమెచ్చుచుఁ గనుంగొనుచు నననిఁకఁ
జెలి నాథుఁ బిల్వవచ్చె ననఁ బిల్వ ననుశబ్దము తుమున్నంతమై యహరు నింక
దనుజుతమ్ముని శాశ్వతముగ నిల్పెను రాముఁ డనఁగ శాశ్వతముగ ననుపదము క్రి
యావిశేషణమయి యలరును మఱి విధేయవిశేషణము తెల్పెద వినుఁడు వయి
రాముండు సుగుణాభిరాముం డనుచు విశేష్యము ముందుఁగాఁ జెప్పి యలవిశేష
ణము పైని నిట్టుల నమరింపఁగా విధేయవిశేషణం బనఁగ వఱలు నిఁక
నావల క్త్వాప్రత్యయార్థపదాల్ వినుం డాసించి పిలిపించి యాడి యలిగి
చేసి చూచి వరించి డాసి నా నివి యెల్ల క్త్వాప్రత్యయార్థమై తనరు మఱియుఁ
బ్రణుతించి విరచించి పరిభవించి యన ల్యప్ప్రత్యయార్థములయి పరఁగు నింకఁ
బడెఁ బఱచెను బెట్టెఁ బా టనుశబ్దముల్ సంస్కృతపదముపై సంఘటింపఁ
జనును సంకటపడె సంతోషపఱచెను బాధపెట్టెను దుఃఖపాటు నడలె
ననఁ బ్రియమును భయము ననునుడుల్ రెండునున్నతోఁగూడిమెచ్చుగఁ బ్రియంప
డె భయంపడె ననఁ బాటిలు నివ్విధమ్మునఁ గొదవపదములు ప్రోగ్గానఁదగ దిఁకఁ
గనుఁగొనఁ గనిన వినిన యనియెడి పలుకులకెల్ల నెఱిఁగింతుఁ గుఱుచమీఁది
యినపదంబు మొదలి యిత్వంబు చెడి పొల్లయై వాఁ డనుటకు నాఁ డనుచుఁగూర్చి
పలుకనౌ నెటులనఁ దెలియుఁ డిదియె కనినాఁ డనఁ దగదు కన్నాఁ డనంగ
విన్నాఁడనంగను వెలయు నిట్టివి జడ్డలై యున్న వాఁడన నమరుచుండుఁ
గన్నవాఁ డనఁగను విన్నవాఁ డనఁగ నీవగలను జెప్పఁగావలయు నాతఁ
డట్టివాఁ డిట్టువాఁ డెట్టివాఁ డొట కొ నట్టిఁడు నిట్టిఁడు నెట్టిఁ డనఁగఁ
బరఁగు నింకఁ గృదంతభావార్థరీతులు తెలుఁగునఁ గొన్నింటిఁ దెలుపుదుఁ దగఁ
దలఁపు వలపు చూపు సోల పనుశబ్దము లుప్రత్యయాంతత నొప్పుచుండు
తలఁకుడు తిరుగుడు నలుకుడు పొదుగుడు నన నుడుప్రత్యయమై చెలంగుఁ
దెలియుట కలఁచుట తలఁచుట యనెడిపదమ్ము లుటప్రత్యయమ్మయితగు
రహి తోఁపడము కొసరడము కోరడమన నలయడముప్రత్యయ మగుచుఁ జనుఁ
గన్నెఱికము రాయమన్నెఱికము కడుఁ బెద్దఱికము నిఱుపేదఱికము
వెఱరాచఱికము కమ్మఱికము ననుపేరు లివి ఱికప్రత్యయ మవుచుఁ దనరుఁ
గోఁత వ్రాఁతయుఁ జేఁత మ్రోఁత యనునుడులు తప్రత్యయమ్మయి తగుఁ నలయిక
పొందిక యచ్చిక పోలిక కోరిక యనఁగ నికప్రత్యయ మయి తనరుఁ

గనుకలి వినుకలి యనఁ గలిప్రత్యయాఖ్య నెసఁగుచుండును వినికి యునికి
యనఁగ నికిప్రత్యయాంతత తగు నింకఁ గలుగుట యనుటకుఁ దెలియఁబఱుతు
బలిమి సూలిమి కూర్మి కలిమి పోఁడిమి తాల్మి యన నిమిప్రత్యయమై తనర్పుఁ
దలఁప నభావార్థముల నమిప్రత్యయములు వచ్చి తగు శబ్దములను గొన్ని
తెలిపెద సంజ్ఞగాఁ దలఁపమి, చేయమి, వినమి, కనమి యన వెలయు నింక,
కిప్రత్యయ మగు దుక్కియన నొక్కట లోభితనము పెద్దతనంబు చెవఁటితనము
నెఱతనమును గ్రామణితనము పందతన మనఁ దనప్రత్యయమయి తనరు
నలుగుట కలుకన, నిలక మునుక పోక యాఁకన కప్రత్యయ మగుచుఁ బొలు
పొందును నిలుకడ పోకడ యనఁ గడప్రత్యయం బగును విఱుగడ పన్ను
గడ తేరుగడ దిద్దుగడ యనంగను గడప్రత్యయ మగుచుఁ గన్పట్టు నింకఁ
గనుటకుఁ గంటయు వినుటకు వింటయుఁ దినుటకుఁ దింటయుఁ దెగి కొనుటకుఁ
గొంటయు ననుటకు నంటయు నన నుటప్రత్యయంబులు వచ్చి పరఁగు నవలఁ
దలఁపఁ బునలకుఁ జుటలు వచ్చి ప్రోపుచును బ్రోచుటయనఁగఁ గొఱలుచుండు
నింపు నిం చనిమెడి యిట్టిపల్కులమీఁద నొక్కొకమెడ నుట లుండెనేని
అదియెల్ల భావార్థపదము లనుచుఁ దెనుంగునఁ దగుఁ గోపింపు టనఁగ మఱియుఁ
గోపించుట యనంగఁ గాపింపుట యనంగఁ గాపించు టనఁగఁ జొక్కనగు నింక
రాగిల్లు విలసిల్లు రంజిల్లు ననుచోట భావార్థమున నుటప్రత్యయ మయి
రాగిల్లుట యనంగ రంజిల్లు టన విలసిల్లుట యనఁగను జెల్లు నవల
నేర్పుచే నింకఁ గొన్ని విశేషములు లెస్స దెలిపెదఁ గవులెల్లఁ దెలిసికొనుఁడు
కాకుసంబోధనకర్మధారయముల నవ్యయాల నచేతనముపయినిఁ బ్ర
థమలపయి కచటతపలకు గసడదవలు వికల్పమ్ముగ వచ్చు నవల
లలి నుదంతక్రియలపయి కచటతపల్ గసడదవ లగు వికల్పమునను
మొకమోట మిటు సెల్లునె కనంగ నృహరి, యటానె గపటపువగలు జగదగణ్య
నీచెప్పినమడి శౌరి చాలు బుధులకు నీసేసినదియె కృష్ణా సనువఁగ
నుపకృతిసేయనై నపురాణవిగ్రహ విబుధులుపొగడ మీఱుబరమాత్మ (?)
నుతియింతు హరివిగాన తమి మనుపు దేవనది నీకు సుతయు గానఁ దగెశార్ఙ్గి
యననొప్పు నింకఁదొల్లిమునులు చెప్పినప్రయోగములు వీనికిఁ దెల్పు దమరవినుఁడు
ప్రబలు నుద్యోగపర్వమునఁ గాకువున కాదేశంబురానిది తెలిపెద నిదె
యవల "నీచెప్పిన" యనెడికందమ్మున నేచక్కఁ గనువాఁడనే యనఁ దగె

ఉ. తారల నెన్నవచ్చు వసుధారజము ల్గణుతింపవచ్చు న
వ్వారిధిభంగసంగ భవవారికణంబులు లెక్కపెట్టి పెం
పారఁగవచ్చుఁగాని యరయంగ మహోత్పలసూతికైన దు
ర్వారవనాటవీరనికరంబుల సంఖ్యల నెన్న శక్యమే. ౧౭౮

సీ. పర్వతోన్నతులు సుపర్ణవేగులు భూరిపవమానసమబలు ల్బాహుసార
వంచితపంచాస్యసంచయు ల్పాషాణపాదపాయుధులును బ్రధనభీము
లగువానరేంద్రులయందుఁ గొందఱు వాలి సుగ్రీవులను గొంద ఱగ్రలీల
నలనీలమారుతనందనులను గొల్చుచు మతంగమాల్యవత్ప్రముఖ నిఖల
శైలముల సర్వకాననస్థలములందు, సంచరించుచునుండి రుత్సాహవృత్తి
నట్టిశాఖామృగోత్తము లందఱకును, వాలి యేలిక యగుచుఁ దావఱలుచుండె.

క. అంతకుమును దశరథభూ, కాంతుఁడు దా మఖసమాప్తి గావించి మహా
సంతోషుఁ డగుచు నగరికిఁ, గాంతలతో నేగె మౌనిగణపరివృతుఁడై. ౧౭౯

వ. ఇట్లు పురంబుఁ బ్రవేశించి యిందిరానివాసం బగుతనమందిరంబు సొచ్చి వసి
ష్ఠఋష్యశృంగాది మునులను బహూకరించి వీడ్కొలిపి యనంతరంబున భూసు
రాది సకలజనంబులకుఁ బసదనంబు లొసంగి వారిం బ్రియపూర్వకంబుగా
ననిపి కళత్రసహితుండై సుఖంబుండి సుపుత్రావాప్తిం గోరుచున్నయెడ నతని
పత్ను లంతర్వత్ను లగుటం జేసి కొన్నిదినంబులకు నక్కాంతలకు. ౧౮౦

సీ. ఆఁకలి తఱచైన నన్నంబు దినిరొయెడుకోరిక లెంతయుఁ గొంచె మయ్యెఁ
బిండివంటలు సున్నియుండలు మొదలైన మధురవస్తువులందు మనసుపుట్టెఁ
బుల్లనై కడు విలసిల్లు ఫలంబులు కరము భక్షింపఁగాఁ గాంక్ష లొదవె
నావులింతలు ఘన మయ్యెను రేఁబగల్ నిద్దురపై మతి నివ్వటిల్లె
యోగినులకుఁ బరధ్యానమొప్పురీతి, నెపుడుచూచినఁబరచింతయొనరియుంటఁ
బలుకరించిన వేగంబ పలుకు టుడిగెఁ, గడఁగి యెడపక వేవిళ్లు పొడముకతన.

సీ. కాయము ల్క్రొంచెంబుగాఁ గృశించుటచేతఁ దన్వంగులనుచుంట తథ్య మయ్యె
నడుగులు మెల్లన నిడి నడచుట మందగామిను లనుట తార్కాణమయ్యె
ముఖములు ధావళ్యమున మించియుండుటఁ జంద్రాస్యలనుమాటసత్యమయ్యె
బడలికచే నవిస్పష్టభాషిణులౌట శుకవాణు లనుపల్కు ప్రకట మయ్యె
ననుచుఁ జూపఱు లెన్నంగ ననుదినంబుఁ, గ్రొత్తరీతులు కడుఁ దళుకొత్తుచుండఁ
జిత్తముల సమ్మదములు రేకెత్తుచుండ, వెలఁదు లొప్పిరి వేవిళ్లు బలియునపుడు.

క. శ్యామలకుఁ గుచాగ్రంబులు, శ్యామలవర్ణంబు లగుచుఁ జక్కఁగ సమరెం
దామరమొగ్గలపై సు, శ్రీమీఁదన్ వ్రాలు చంచరీకము లనఁగన్. ౨౯౦
గీ. ఇవ్విధంబునఁ దగియున్న జవ్వనులకు, నంతకంతకు గర్భంబు లతిశయిల్ల
నాభిదేశంబు లధికనిమ్నములు గాక, లలితవికచాబ్జములరీతి నలరుచుండె.
గీ. అంగనల కళిసీలరోమావళులకు, వళులు లేకుండె మిగుల గర్భములు పొదల
బరువటంచునుగటితటాభరణమాది, గలుగుతొడవులువిడిచిరక్కమలముఖులు.
గీ. రత్నగర్భంబు లగుచు విరాజితంబు, లైనస్ఫటికపుఁగలశంబులట్లు మిగులఁ
బుండరీకాక్షతేజోవిభూషితంబు, లగుచు మగువలగర్భంబు లలరుచుండె. ౨౯౩
వ. అనంతరంబ. ౨౯౪

—: దశరథునకుఁ బుత్త్రోత్పత్తి. :—

గీ. రమణ దశరథ సీమనోరథము పండ, వలె నటంచును బంధితవరులు దండఁ
బలుక వినుచు నరేశ్వరుం డలరుచుండ, నెలఁతలకు నంతకంతకు నెలలు నిండ.
వ. ఒక్క సమయంబున నద్ధరాకాంతకాంతలలో నగ్రగణ్యయగు కౌసల్యాదేవికి.
క. నొప్పులు పొడమిన దాదులు, గుప్పున మది నెఱిఁగి యింకఁ గోమలికి సుతుం
డొప్పుగఁ బుట్టునటంచును, ముప్పిరి గొను వేడ్క లపుడు మొనయుచునుండన్.
వ. పరివేష్టించి యున్నసమయంబున నొక్క పరిచారిక శీఘ్రంబున. ౨౯౭
క. క్షీరాన్న మొప్పుగను బం, గారపుఁబాత్త్రమునఁ దెచ్చి కౌసల్యకుఁ దాఁ
గూరిమిఁ దిను మని యొసఁగిన, సారసముఖి యించుకంత సరగ భుజించెన్.
వ. తదనంతరంబ యాశంబరనితంబ యామనస్యంబు సహింప నేరక దీనాలాపం
బులు వలుకుచున్నయెడ నయ్యన్నులమిన్నం గని యచ్చటనున్న వృద్ధాంగ
నలు తత్కాలసముచితవచనంబు లాడుచు నిమిషంబులు వత్సరప్రాయంబుగాఁ
గడపుచున్నంత. ౩౦౦

సీ. నియతిఁ బండ్రెండవనెల యగుచైత్రమాసంబున శుక్లపక్షంబునందు
నవమిం బునర్వసునక్షత్రమున సౌమ్యవాసరమ్మున ననివార్యలీలఁ
జౌవంచగ్రహము లుచ్చస్థానముల నుండ శశిబృహస్పతు లొక్కచక్కిఁ గూడ
ఘనకుళీరాఖ్యలగ్నమునందు నృపకాంత కనియెఁ గుమారుని ఘననిభాంగుఁ
బుండరీకాక్షునర్ధమై దండి మెఱయు, చుండువాని విభాకరాఖండతేజుఁ
బుండరీకాయతాక్షు నాఖండలాది, సురసమాజనిరంతరస్తుతచరిత్రు. ౩౦౧
గీ. మగువ లందఱు హర్షనిమగ్న లగుచు, నపుడు సముచితకృత్యంబు లాచరించి
సుతుని నెంతయుఁ గౌసల్య చూచుచుండఁ, గనిరి వారల కన్నులకఱవుదీఱ.

చ. దివిజులు పుష్పవృష్టి జగతిం గురియించిరి దివ్యభేరికా
రవములు మింటఁ జొప్పడెఁ గరంబు దెసల్ వెలుఁగొందె మానితో
త్సవమున నప్సరోంగనలు సల్పిరి నాట్యము గంధయుక్తమై
యవిరళశైత్యమాంద్యయుతమై పవమానము వీచె నయ్యెడన్. ౩౦౩

క. పుత్రుఁడు గలిగె నటంచును, మిత్రులు దెలుపంగ నపరిమిత మోదమునన్
ధాత్రీపతి మదిఁ బొంగుచుఁ, జిత్రాంబరభూషితులుగఁ జేసెను వారిన్. ౩౦౪

వ. మఱియు నద్దశరథుండు భేరీమృదంగ పటహకాహళవేణువీణాదిరావంబు లొన
ర్పం దగువారి నియమించిన వా రట్లు సేయం దద్ఘోషంబు లేకం బై పురలక్ష్మి
యమ్మహారాజపుత్రోదయసమయమహోత్సవంబు చాటె ననుభంగిం దేజరిల్లి
పౌరజనంబులకు శ్రవణానందకరం బై యొప్పెఁ దదనంతరంబున. ౩౦౫

క. కైకేయి ప్రసవవేదనఁ, బ్రాకటముగఁ బొందుచుండఁ బంకజనేత్రల్
లౌకికకృత్యముల న్వడిఁ, జేకొని కావించి రపుడు చిత్తము లలరన్. ౩౦౬

క. పరమగుణ కైక గురువా, సరసంయుతదశమిఁ బుష్యసంజ్ఞికతారన్
వరమీనలగ్నమున సుతుఁ, బురుషోత్తము నంశమునను బొలుపుగఁ గనియెన్.

గీ. రభసమున మింట దేవదుందుభులు మొరసెఁ, గుసుమవర్షంబుఁ గురియించి రసురవైరు
లంత ధరణీసుఁ డాత్మలో సంతసిల్లెఁ, దూర్యనినదంబు లెసఁగె నిస్తులతఁ బురిని.

గీ. చెలువుమీఱంగ నేకాదశిని సురారి, గురుదినంబున నాశ్రేషఁ గుశల మైన
కర్కటకలగ్నమున నృపాంగన సుమిత్ర, కనియెఁ గృష్ణాంశమునఁ గవగాఁ గసుతుల.

క. దివి మ్రోసె దేవదుందుభు, లవనిస్థలిఁ బుష్పవృష్టి నలరించిరి దా
నవవైరు లంతఁ జల్లని, పవనం బొగి వీచె దిశలఁ బరిమళయుత మై. ౩౦౭

ఉ. అంత ధరాతలేంద్రుఁడు నిజాంగన పుత్రులఁ గన్నయట్టి వృ
త్తాంతము వించు నెంతయు ముదంబునఁ బొంగుచు నిన్నినాళ్లకు
స్వంత దొలంగె నంచు బుధవర్ణితభాగ్యము గల్గె నంచు నీ
సంతతుల న్సమంచితయశం బిలఁ గాంచెద నంచు నెంచుచున్. ౩౦౮

గీ. డంబుమీఱంగఁ బుత్రోత్సవంబు నెఱపఁ, బూనుచు నతిప్రయత్నమప్పుడ యొనర్చి
యఖిలజనులకు నిష్టమృష్టాన్నసలిల, దానములఁ దృప్తి చేసె నుదారలీల.

సీ. సూతమాగధవంది వైతాళికులకు మేలాటపాటలతోడి పాటవంబు
నీటుచూపెడు నాటబోటులకును దాసదాసీనటాదివితానములకు
మక్కువ మీఱంగ నక్కజంబుగఁ గోర్కి కెక్కువౌ విత్తంబు చక్కగ నిడి
సాధుభూసురసహస్రంబుల కతిభక్తి గోహిరణ్యంబుల కోటు లిచ్చి

కవుల కంబరభూషాదికము లొసంగి
మానఘను లగు హితులకు మంత్రివరుల
కమితబహుమానములఁ బ్రమోదము ఘటించి
సకలజనసన్నుతులు గాంచె సంభ్రమమున. ౨౧౩

గీ. తథ్య మెన్నంగ జగతి నీదశరథేశుఁ, డంబుజాతాక్షుఁడగు సందియంబు లేదు
కాకయుండిననితఁడు శ్రీకలితవత్సుఁ,డజసుతుఁడుభూపతియునౌనెయనిరిబుధులు.

క. ఇటు పుత్రోత్సవకృత్యము, పటుమతి నరపుంగవుండు పంక్తిరథుం డా
దట నొనరిచి యిటమీఁదన్, ఘటియిల్లు శుభంబు లెల్లఁ గమలాక్షుకృపన్.

వ. అని తలంచుచుండి పదంపడి పండ్రెండవదినంబునఁ బురోహితుం డగు వసిష్ఠుని
బిలిపించి కుమారులకుఁ బుణ్యాహవాచనపూర్వకంబుగా జాతకర్మంబులు సే
యించి యమ్మునీంద్రునిం జూచి. ౨౧౬

క. మునివర నాసూనులకును, ఘన మగుకృపతోడ నామకరణంబులు నీ
వొనరింపు మనిన నాతఁడు, మనుజాధిపు వచనములకు మన మలరంగన్.

గీ. రమ్యకౌసల్యసూనుండు రాముఁ డనుచుఁ
బరమకైకేయి కొమరుండు భరతుఁ డనుచు
ఘనసుమిత్రాసతీమణీతనయు లొలిఁ
దనర లక్ష్మణశత్రుఘ్ను లనుచుఁ బలికె. ౨౧౮

వ. ఇవ్విధంబున నామకరణంబు లొనర్చి సర్వోర్వీసురపర్వసహితుం డై యాశీర్వ
చనంబులు చేసిన దశరథుండు సంతుష్టాంతరంగుం డై తత్సమయోచితమహో
త్సవంబు గావించి వసిష్ఠాదులం బూజించి వీడ్కొలిపి పుత్రమిత్రకళత్రసమేతుం
డై రాజ్యపరిపాలనంబు సేయుచు సుఖం బున్నంత. ౨౧౯

క. నలుగురు బాలురు వరుస, న్నెలనెల కొక్కొక్క తేట నెగడఁగ సుతులన్
లలిఁ జూచి తల్లిదండ్రులు, కులపాలకు లగుదు రనుచుఁ గోర్కులు మీఱన్.

క. ఎత్తుకొని ముద్దువెట్టుచు, మెత్తనిమేనిపయిఁ గేలు మృదులతరలీలన్
హత్తించి దువ్వుచును దమ, చిత్తము లలరంగఁ జొచ్చి చెలఁగుచునురు గడున్.

వ. ఇట్లానందించుచుఁ గుమారపోషణావలోకనతత్పరులై యుండఁ బ్రవర్ధమాను
లగు నారామభరతలక్ష్మణశత్రుఘ్నులు మూఁడవవత్సరంబు ప్రవేశించిన.

సీ. అందియ ల్గజ్జెలు పొందుగా మ్రోయంగ వడివడి గునగున నడచుచుండి
మురువులు గొలుసులు మురువుగా నాదింప వలనొప్పఁ జప్పట్లు వైచుచుండి.

పాటపాడినరీతి నేటుగా నవ్యక్త లలితవాచావళు ల్పలుకుచుండి
యంకస్థలంబుల నందము ల్మెఱయంగ గారాము నెఱపుచుఁ గూరుచుండి
తల్లిదండ్రుల కధికముదంబుఁ గూర్చి, దినదినంబున కొకవింతతేజ మెసఁగఁ
గన్నవారలకన్నులకఅవుదీఱ, వెలయుచుండిరి ధరణిలోఁ బలను మిగుల. ౩౨౩

గీ. అత్తయన్నయ్యమామయమ్మవ్వతమ్ముఁ, డనుచు రామాది బాలకులద్భుతముగఁ
దల్లి దండ్రుల కోర్కులు పల్లవింపఁ, బలుక నేర్చిరి మధురసంభాషణములు. ౩౨౪

గీ. అక్కుమారులఁ గనుఁగొని పక్కుగతుల, మక్కువలు మీఱఁగా శుకవాక్కులోలయు
గ్రక్కుననుముద్దుగొనుచు నొక్కొక్కసారె, చక్కగా నెత్తుకొనుచుండురక్కజముగ.

వ. మఱియు నయ్యంగనామణు లక్కుమారరత్నంబుల గాంచి. ౩౨౬

సీ. ఈరామునీలశోభారాముఁ గన్నయీవామాక్షి తొల్లింటినోము ఫలము
నీభరతుని వారిదాభాయుతునిఁ గన్న యీభామినీమణి వైభవంబు
నీలక్ష్మణుని రమ్యశీలు శత్రుఘ్నుని లీలతోఁ గన్న స్త్రీయాలిమహిమ
నీనందనులఁ గాంచి యానంద మొందుచు మానుగాఁ జెల్వొందువానితపముఁ
దలఁచి నుతియింప వశమానెధాత్రిలోన, హరునకైనను భారతీవరునకైన
గురునకైనను బన్నగేశ్వరునకైన, మానికైనను దలఁప సేనానికైన. ౩౨౭

క. అని వినుతించుచునుండఁగ, విని మనుజవరేణ్యసతులవేడ్కలు దమ నె
మ్మనముల ఘనములుగాఁగను, దనయులఁ గైకొందు రధిక తాత్పర్యములన్.

వ. ఇవ్విధంబున నద్దశరథేశ్వరు ముద్దియలు సుతుల నొద్ద నుంచుకొని తద్దయు ముద్దులాడుచు వారు కోరినరీతిని క్షీరశర్కరాన్నపానీయ ఫలదానంబులం జేయుచు వారికి నూతనధౌతాంబరంబులు గట్టుచు వజ్ర వైడూర్య నీల గోమేధిక పద్మరాగ పుష్యరాగాది నవనవరత్నస్థాపిత జాంబూనదాభరణంబులు దొడుగుచుఁ దారాకారహారంబులు గళంబులం గదియించుచు వారల మందహాస సుందరవదనేందు నయనారవిందంబుల యందంబులు డెందంబులయందుఁ బొందుపఱిచి యమందానందంబులం జెందుచు వారిం బ్రేమాలవాలవీక్షణంబుల నవలోకింపుచు సొంపు మీఱ బెంపుచున్నఁ గొన్నివత్సరంబు లరిగిన నొక్కదినంబున దశరథుండు కుమారులం గని యిట్లని వితర్కించె. ౩౨౯

—: రామాదుల కుపనయనసంస్కారములు. :—

క. ఈతఱి సంధ్యాదిలస, త్ప్రాతవిధు ల్పలుపఁ దగినబుద్ధులు గలస
న్నీతులతనుజాతుల నుపనీతులఁ గావింపవలయు నేమమెలర్పన్. ౩౩౦

క. అని తలఁచి వసిష్ఠమహా, మునివరు రప్పించి మోదమున మీరలు నా
తనయుల కుపనయనంబుల, నొనరింపఁగవలయు ననుచు నొప్పుగఁ దెలుపన్.

చ. విని మునిముఖ్యుఁ డాత్మఁ గడు వేడుకఁ జెంది నరేంద్ర యిప్పు డీ
ఘనశుభకార్య మీవు కుతుకంబునఁ జేయుట మేలుగాదె నా
మనమున నిట్లు దోఁచె నిట మంచిముహూర్తము గూడి యుండె నం
చనుపమవాక్యులం దెలుప హర్షముఁ జెందె నృపాలుఁ డెంతయున్. ౩౩౫

సీ. పిమ్మట మహనీయుఁ డమ్ముని శ్రేష్ఠుండు సచివులఁ గన్గొని సరభసముగ
దశరథుం డాత్మలోఁ దలఁచిన భద్రకార్యం బెఱింగించి జనంబుతోడ
సకలసంభారము లనుమహోర్ప్రవలయు మీరనిన వారలు ముదం బునుచుండి
మునిచెప్పినట్టు లప్పనులు సేయించి సత్వరమునఁ దెల్పఁగా గురుఁ డతండు
వికసితాననుఁ డగుచు నవ్వేళయందు, క్షితిపు నాతనిసతులను సుతుల సతుల
మతులసుకృతులసద్గుణయుతులఁగృతుల, మంగళస్నానములనొనర్పంగఁబలికె.

క. పలికినవారలు మజ్జనములు గావించుచును జిత్తములఁ వేడుకలన్
లలితాంబరమణిభూషణములు వేగ ధరించియున్న మునిపతి యంతన్.

సీ. భవ్యపీఠంబుల బాగుమీఱఁగ వారిఁ గూర్చుండ నియమించి గొనబుమీఱు
భద్రవాద్యములు సముద్రముల్ ఘోషించుభంగి నపారశబ్దములు వలుక
మంత్రతంత్రవిధుల్ క్రమంబునఁగావించి హుతవహునాజ్యాదిహోమములను
బ్రీతుని జేయుచుఁ బిదపఁ జేయంగల కృత్యములెల్ల నగ్గింపఁ జేసి
వరుస దప్పక శాస్త్రోక్తసరణి రామ, భరతలక్ష్మణశత్రుఘ్నబాలకులను
బ్రహ్మమంత్రోపదేశసంప్రాప్తభూతి, తేజుల నొనర్చె నమ్మునిరాజు లలర. ౩౩౬

వ. తదనంతరంబున. ౩౩౭

క. ఘనయజ్ఞసూత్రకృష్ణా, జినమౌంజీదండధరుల క్షితిపతిసుతులం
గని ముని భిక్షాపాత్రములను వేడ్కనొసంగి సంజ్ఞల న్నెఱిఁగింపన్. ౩౩౮

క. వామనమూర్తు లనంగా, శ్రీమించి చెలంగు రాజశేఖరతనయుల్
రామాదులు జనసన్నుత, ధీమహితులు సుగుణయుతు లతిత్వరతోడన్. ౩౩౯

వ. తల్లిదండ్రుల మనోవల్లు లానందపల్లవాన్వితంబు లై శోభిల్లఁ దత్పాదపల్లకం
బులకు నమస్కరించి క్రమమున వారలం జూచుచు. ౩౩౯

క. గంభీరనాద మలరఁగ, "త్వం భిక్షాం దేహి" యంచుఁ దగ వేడుకొనన్
జంభారినిభుం డగున, య్యంభోజహితాన్వయేశుఁ డతివలుఁ దానున్. ౩౪౦

క. "శతధృతి రివ పరమాయు, స్సతతం భజ" యనుచు వసుస వస్మద మొదవన్
సుతులకు నాశీర్వాక్యము,లతులితముగఁ బలికి యంత నతిశీఘ్రమునన్. ౩౮౧

ఉత్సాహ. కనకరజతవస్త్రమౌక్తికములు చాలఁ దెచ్చి స
త్తనయకరసరోజకనకుదార హేమపాత్రలం
దునుప వార లాత్మ మోదమొప్ప నప్పదార్థముల్
మునివరేణ్యుఁ డగువసిష్ఠముని కొసంగి రన్నియున్. ౩౮౨

గీ. వలను మీఱ నరుంధతీవరుఁడు పిదపఁ, దగువిధానమ్ము లొనరించి దశరథేశ
నిన్ను సుతులను దీవించుచున్నవిప్ర, వరుల నెల్లను మన్నింపవలయుననుఁడు.

ఉ. భూమిపతీశ్వరుండు పరిపూర్ణమనోరథుఁ డై ధరామర
స్తోమముల న్సువర్ణముల శోభనలీల వెలుంగు భూరి ము
క్తామణుల న్నవాంబరవితానములం బ్రియ మందఁజేసి త
త్తామవచస్సుతు ల్వినుచు సంతసమందుచు నుండె నయ్యెడన్. ౩౮౪

క. అన్నన్న యన్నదానం, బిన్నరవరుఁ డిట్లుసేయునే యంచు జనుల్
సన్నుతులు చేయురవములు, విన్నందుచు నుండె సురలు మేలనిపొగడన్.

ఉ. అంత వసిష్ఠుఁ డమ్మహిపు నాదరమొప్పఁగఁ జూచి మేదినీ
కాంత మహాశ్రమంబునకుఁ గ్రచ్చుఱ నేనిఁకఁ బోయివత్తు నీ
కాంతలు నీతనూభవశిఖామణు లీవునుఁ గూడి పూర్వది
క్కాంతవిలాస మొప్పఁగ సుఖంబుగ నుండుఁ డటంచుఁ బ్లిన్. ౩౮౬

గీ. మౌనివరుపాదములకు నమస్కరించి, నాకుమారుల కుపనయనంబు లధిక
విధులఁజేయించితిరి వేదవిదులుమెచ్చ, మిమ్ముసుతియింప నాకువశమ్ముగాదు.

క. అని మునివరునకుఁ బ్రీతిని, ధనవసనమణీవితానతాంబూలములన్
వినయమున నిచ్చి యనిపెను, మనమునసంతోషమొదవ మహిపతియంతన్.

వ. కొన్నిదినంబు లరిగిన. ౩౮౯

—: రామాదుల విద్యాభ్యాసము. :—

క. గురు మతి యగునరపతి నలు, గురుసుతులకుఁ జదువులబ్బఁ గోరి కొమరులన్
గురువుల కొప్పించిన న, గ్గురుతేజులు గురులచెంతఁ గూరిమితోడన్. ౩౯౦

వ. మెలంగుచుఁ బొలంగని భక్తిభావంబులం జెలంగుచు విద్యాభ్యాసంబు చేయుచు
విధినిమిత్తంబున రామలక్ష్మణులు ను భరతశత్రుఘ్నులు ను బరస్పరం బత్యంత
స్నేహానిబద్ధబుద్ధు లై ప్రవర్తించుచుండి వేదవేదాంగధనుర్వేదాదిసమస్తవిద్యా

విశేషంబులు నేర్చి గజాశ్వరథారోహణాదులవలన వలనుగలిగి సకలగుణమణి
గణాలంకృతు లై యొప్పుచుండ బుధజనంబు లక్కుమారులం గాంచి క్రమంబున
నుతియింపఁ బూని రె ట్లనిన. ౩౫౦

క. ఈరాముఁడు తలిదండ్రులు, గారామునఁ బెంచుచుండఁగాఁ బ్రబలుం డై
తా రాజకుమారులలోఁ, దా రాజాని క్రియ మిగులఁ దనరెడు మఱియున్. ౩౫౧

సీ. ధారాధరము నెన్ను తనుకాంతి గలవాఁడు చంద్రబింబోపమాస్యంబువాఁడు
కంజాతములఁ బోలు కందోయి గలవాఁడు నీలంబులను గేరు నెఱులవాఁడు
కరితుండముల మించు ఘనభుజంబులవాఁడు చక్కనిపీనవక్షంబువాఁడు
పల్లవంబుల మించు పాదము ల్గలవాఁడు కంబువిలాసకంఠంబువాఁడు
ఘనమృగేంద్రనిభావలగ్నంబువాఁడు, మెచ్చఁదగువాఁడు కీర్తులఁ దెచ్చువాఁడు
హెచ్చుగలవాఁడు కారుణ్య మిచ్చువాఁడు, మచ్చికలొనర్చి బుధులను మెచ్చువాఁడు.

చ. తలఁపఁగ నిట్టి లన్యవసుధావరనందనులందు సత్యవా
క్కులు గలమేటి లేఁడు బుధకోటులు మాటికి నెన్నఁ జాలు న
త్యలఘుగుణంబులుం గలుగునట్టి మహాత్ముఁడు సోదరాదరుం
డలరులవింటిజోదుబలె నందము గల్గినవాఁడు చూడఁగన్. ౩౫౩

గీ. పుండరీకాక్షుఁ డితఁడు గాఁ బోలు నట్లు, గాకయున్నను బుండరీకములభంగిఁ
గన్నులలరారుచుండు నే ఘనకృపార,సంబు చూపులఁ జిలుకు నేజనులమీఁద.

గీ. అన్నగారిఁ బోలు నమితరూపంబున, నన్నగారి నేలు నతులమహిమ
నన్న భరతుఁ డితని జెన్నుగా జగతిని, గన్నవారి భాగ్య మెన్ననగునె. ౩౫౪

క. విధుసోమసమాఖ్యుండున్, బుధరతుఁ డరిమోదహారి భూరివరకళా
నిధి రాజనఁ దగు నీతం, డధికత భరతాఖ్య గనుట యబ్బుర మగునే. ౩౫౫

గీ. లలితసర్వభద్రలక్షణలక్షితుం, డగుట నితఁడు లక్ష్మణాఖ్యఁ దనరె
నితనిఁ గాంచువార లతులతరామోద,యుతమనోబ్జులగుచు నుందురవని. ౩౫౬

క. పాత్రతరధర్మమతిని సు, మిత్రాత్మజుఁ డెన్నఁగా సుమిత్రాత్మజుఁ డా
ధాత్రిని నీధర్మరతుం, బుత్రునిగాఁ గన్నయినుఁడు బుధనుతుఁడు గదా. ౩౫౭

క. శత్రువుల సంహరింపఁగ, ధాత్రిన్ భుజశక్తి గలిగి తనరెడుఁ గానన్
శత్రుఘ్న నామధేయము, చిత్రంబుగఁ గాంచె నితఁడు చిరయశమబ్బన్. ౩౫౮

శా. ఈరీతి న్నుతిగాంచి మించుసుతుల న్వీక్షించి ధాత్రీశ్వరుం
డీరామాదులు నూత్నయావనలసద్దేలాయుతు ల్గావునన్

ఆంధ్ర సాహిత్యపరిషత్తు—ప్రతిష్ఠాపకులు.

శ్రీరాజా రావు వేంకటకుమారమహీపతి సూర్యారావుబహద్దరువారు, పిఠాపురము మహారాజా వారు. పరిషద్యావజ్జీవాధ్యక్షులు.

కీ. శే. శ్రీ వేంకటగిరి మహారాజావారు.

ఉద్ధారకులు.

శ్రీరాజా వేంకటాద్రి అప్పారావు బహద్దరువారు- ఉయ్యూరు జమీందారువారు.

కీ. శే. శ్రీబొబ్బిలి మహారాజావారు.

ఆంధ్ర సాహిత్యపరిషత్కార్యనిర్వాహకవర్గము.

అధ్యక్షులు

జయంతి రామయ్యపంతులుగారు బి. ఏ., బి. ఎల్.

కార్యదర్శులు.

కిడాంబి రాఘవాచార్యులుగారు ఎం. ఏ., బి. ఎల్.

వింజమూరి వెంకన్నపంతులుగారు ఎం. ఏ.

కార్యనిర్వాహకసభాసభ్యులు,

దివాన్ బహదర్ కొమ్మిరెడ్డి సూర్యనారాయణమూర్తి నాయుడుగారు (కోశాధ్యక్షులు.)

పెద్దాడ రామస్వామిగారు, ఎం. ఏ.

చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు.

కాశీభట్ట సుబ్బయ్యశాస్త్రిగారు.

శ్రీమాన్ గొడవర్తి జగన్నాథస్వామిగారు, ఎం. ఏ., ఎల్ టి.

దర్భా వేంకటశివరామరాజుగారు, బి. ఏ., బి. యల్

అళక్కి వేంకట్రామయ్యగారు.

శేశవరపు రామరాజుగారు.

కోకా వేంకటసుబ్బారావు నాయుడుగారు.

ఓలేటి వేంకటరామశాస్త్రిగారు, శతావధాని.

పానుగంటి లక్ష్మీనరసింహారావు పంతులుగారు.

పిళ్ళారిశెట్టి రంగబ్రహ్మారావునాయుడుగారు.

కాకినాడ-ఆంధ్రసాహిత్యపరిషత్తులో వెలకుదొరకు గ్రంథములు.

1 విప్రనారాయణచరిత్రము-చదలువాడ మల్లయ్యకవి		రు	0	8
2 కవిజనాశ్రయము-వేములవాడ భీమకవి	...	...	0	10
3 చంపూరామాయణము-ఋగ్వేదికవి వేంకటాచలపతికవి		...	1	0
4 నీతిసీసపద్యశతకము-తాళ్ళపాక పెదతిరుమలార్యుఁడు	...	...	0	2
5 జ్యోతిశ్శాస్త్రసారము-శ్రీమాన్ కఠిస్థళం కృష్ణమాచార్యులుగారు		...	0	8
6 జ్ఞానప్రసూనాంబికాశతకము-శిష్టు సర్వశాస్త్రికవి	...	...	0	2
7 సర్వేశ్వరశతకము-యథావాక్కుల అన్నమయ్యగారు	...	...	0	3
8 యుద్ధమల్లుని బెజవాడ శిలాశాసనము-జ. రామయ్యపంతులుగారు		...	0	8
9 కావ్యాలంకారచూడామణి-విన్నకోట పెద్దయకవి	...	...	0	8
10 చంద్రభానుచరిత్రము-తరిగొప్పుల మల్లనకవి	...	...	1	0
11 అకారాద్యముద్రిత గ్రంథసూచిక	...	...	0	8
12 ప్రాకృతభాషోత్పత్తి-శ్రీమాన్ మేడేపల్లి వేంకటరమణాచార్యులుగారు		...	0	12
13 శివతత్త్వసారము-మల్లికార్జునపండితారాధ్యులు	...	...	0	12
14 Defence of Literary Telugu జయంతి రామయ్యపంతులుగారు		...	0	8
15 శివరాత్రిమాహాత్మ్యము-శ్రీనాథమహాకవి	...	...	0	12
16 ఆర్యభాషావిభాగము-శ్రీమాన్ మేడేపల్లి వేంకటరమణాచార్యులుగారు		...	0	8
17 Dravidian Lexicography జయంతి రామయ్యపంతులుగారు		...	0	4
18 హరిస్వరంగములు-కొత్తపల్లి సూర్యరావుగారు	...	...	0	8
19 నారసింహపురాణము—ఉత్తరభాగము-హరిభట్టు	...	...	1	0
20 మన్నారుదాస విలాసనాటకము—రంగాజమ్మ	...	...	0	8
21 జైమినిభారతము-వచనము-వేంకటకృష్ణప్పనాయఁకుఁడు		...	0	12
22 కాళిందీకన్యాపరిణయము (రెండుభాగములు) అహోబలపతి		...	1	4
23 రెడ్డినాఁటి రెండుశాసనములు	...	...	0	4
24 ఆంధ్రధాతుమాల—చిన్నయసూరి	...	...	0	12
25 శాసనపద్యమంజరి	...	...	0	12
26 శతకసముచ్చయము (ప్రథమభాగము)	...	...	0	12
27 ,, (ద్వితీయభాగము)	...	...	0	10
28 పరిషత్పుస్తకభాండాగారము. (ద్వితీయభాగము)	...	...	0	8
29 సూత్రాంధ్రవ్యాకరణములు—చిన్నయ్యసూరి	...	...	0	8
30 రసాభరణము—అనంతకవి.	...	...	0	8
31 చాటుధారాచమత్కారసారః- (సంస్కృతము)	...	...	0	8
32 ఉత్తరరామచరిత్రము-జయంతి రామయ్యపంతులుగారు		...	1	0
33 షోడశకుమారచరిత్రము-వెన్నెలకంటి అన్నయ	...	...	0	8
34 అమరుకము-సాంధ్రము-జయంతిరామయ్యపంతులుగారు		...	1	0
35 సాంబోపాఖ్యానము-రామరాజురంగప్పరాజు	...	...	1	0
36 హంససందేశము-కల్లూరి వేంకటరామశాస్త్రిగారు	...	...	0	2
37 సింహాసనద్వాత్రింశిక-ద్వితీయభాగము-గోపరాజకవి	...	...	0	10
38 రాయవాచకము	...	...	0	8
39 ఆంధ్రశబ్దచింతామణి-బాలసరస్వతీకృతాంధ్రటీకోపేతము		...	0	8

Printed by N. Achutaramiah at the Cocanada Printing works, Cocanada.